

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, సీపీ శంఖబ్రత బాగ్చీ

ఐటీ సేవలు మరింత విస్తృతం

పాలనలో సంస్కరణలు అమలుచేస్తాం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



‘డిజిటల్ ఏపీ’ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు. చిత్రంలో కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా సమస్యల విభాగం సెక్రటరీ వి.శ్రీనివాస్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఎన్ఐసీ అదనపు కార్యదర్శి అభిషేక్‌సింగ్, ఏపీ ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ ఉన్నారు

- ఈ-గవర్నెన్స్ సదస్సులో పాల్గొన్న అనంతరం కేంద్ర అధికారులతో భేటీ
- ఆర్‌టీజీఎస్ అమలు, ఇంకా తీసుకోవలసిన చర్యలపై చర్చ

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ సేవలు మరింత విస్తృతం చేస్తామని, పరిపాలన సంస్కరణలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నోవాటెల్ హోటల్‌లో సోమవారం ప్రారంభమైన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో పాల్గొన్న ఆయన ఆ తరువాత కేంద్ర కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పరిపాలనా సంస్కరణల్లో వినూత్న విధానాలు అనుసరిస్తున్న రాష్ట్రాలకు ఈ సదస్సులో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ అవార్డులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఏపీలో ఆర్‌టీజీఎస్ అమలు చేస్తున్నామని, అందులో లోపాలు, ఇంకా తీసుకోవలసిన చర్యలు ఏమైనా సూచించాలని వారిని కోరారు. ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలు, వాటిని ఏపీలో అమలు చేయడానికి గల అవకాశాలపై చర్చించారు. విజయవంతమైన మోడళ్లను ఏపీలో ప్రవేశపెడతామని, వాటికి సంబంధించిన అంశాలను విజయవాడకు వచ్చి తమకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు వివరించి సూచనలు కోరారు.



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

ఆపరేషన్ లంగ్స్‌పై చర్చ

ఈ సమావేశంలో పాల్గొన్న విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ నగరంలో రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని తొలగించామని, ఆపరేషన్ లంగ్స్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చాలామంది హర్షిస్తున్నారని ముఖ్యమంత్రి ... మిగతా 6వ పేజీలో

జీఎస్‌టీపై వినియోగదారుల పెదవి విరుపు

ప్చ్...

- జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుకాని కొత్త శ్లాబులు
- కేంద్రం ఆదేశించినా పట్టించుకోని వ్యాపారులు
- పాత ధరలనే వసూలు చేసిన వైనం
- నిత్యావసర సరకుల ధరల్లో ఎటువంటి మార్పూ లేదు
- ఎలక్ట్రికల్ వస్తువులు, ఫుట్‌వేర్, కార్లు, బైకుల రేట్లు మాత్రం తగ్గింపు





విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలుచేసిన జీఎస్టీ నూతన శ్లాబుల విధానం జిల్లాలో తొలిరోజు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇప్పటివరకూ అమల్లో ఉన్న 5, 12, 18, 28 శాతం శ్లాబుల స్థానంలో, కేవలం 5, 18 శాతం శ్లాబులను కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం నుంచి కొత్త శ్లాబులను అనుసరించి విక్రయాలు సాగించాలని ఆదేశించింది. అయితే జిల్లాలో అనేక వస్తువుల ధరలను తగ్గించేందుకు వ్యాపారులు ఇష్టపడలేదు.

ముఖ్యంగా నిత్యావసర సరకులు, మందులు, ఫుట్‌వేర్, వస్త్రాలపై నూతన జీఎస్టీని అనుసరించి ధరలను తగ్గించాల్సి ఉండగా, వ్యాపారులు పట్టనట్టు వ్యవహరించారు. వినియోగదారులు ప్రశ్నిస్తే పూర్తిస్థాయిలో సమాచారం రాలేదని వాదిస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే తాము జీఎస్టీ చెల్లించి కొనుగోలు చేసిన సరకులను తగ్గించి అమ్మడం సాధ్యం కాదన్నారు. కాగా ఎలక్ట్రికల్ వస్తువులు, కార్లు, బైక్‌లపై తగ్గిన శ్లాబులు అమల్లోకి వచ్చాయి. వాటికి దసరా ఆఫర్లు తోడవ్వడంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఎగబడ్డారు.

తగ్గాల్సిన వస్తువులు ఇవే..

మిల్క్, చీజ్, పిజ్జా, బ్రెడ్, చపాతీ, రోటీ, కొన్ని రకాల మందులు, నోట్‌బుక్స్, ఎక్సర్‌సైజ్ బుక్స్, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, క్రయాన్స్ వంటివి 12 శాతం శ్లాబు నుంచి జీరో శ్లాబులోకి మార్చారు. అంటే వీటిపై జీఎస్టీ వసూలు చేయకూడదు. అలాగే కండెన్స్‌డ్ మిల్క్, బటర్, నెయ్యి, చీజ్, రూ.2,500 కంటే తక్కువ ధర గల ఫుట్‌వేర్, వస్త్రాలు, కాటన్, జ్యూట్ హ్యాండ్‌బ్యాగ్స్, కొన్నిరకాల ఫర్నిచర్, కిరోసిన్ స్టవ్, లాంతర్లు, డ్రైఫూట్స్, డయా బెటిక్ ఫుడ్స్, వ్యవసాయ యంత్రాలు, సౌరశక్తి పరికరాలు 12 శాతం నుంచి ఐదు శాతం శ్లాబ్‌లోకి మార్చారు. టాల్కమ్ పౌడర్, షాంపూ, హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్, కేక్, బిస్కెట్స్, కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్, ఐస్‌క్రీమ్, మినరల్ వాటర్ కూడా ఐదు శాతం శ్లాబులోకి వచ్చాయి. ఎయిర్ కండిషన్లు, డిష్ వాషింగ్ మెషీన్లు, 1200 సీసీ కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల పెట్రోల్, 1500 సీసీ కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల డీజిల్ వాహనాలు 28 శాతం నుంచి 18 శాతం జీఎస్టీ శ్లాబులోకి మారాయి.

తగ్గింపు వీటికే పరిమితం

తగ్గిన జీఎస్టీ శ్లాబులను జిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే ... మిగతా 6వ పేజీలో

పెద్దగా మార్పేమీ లేదు

- తగ్గిన జీఎస్టీకి తగ్గట్టుగా ఆఫర్లు కుదింపు

మద్దిలపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రం వస్తు సేవల పన్ను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఆదివారం ధరలకు, సోమవారం ధరలకు పెద్ద తేడా కనిపించలేదు. తొంభై శాతానికిపైగా నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి మార్పు లేదు. నగరంలోని డిపార్టుమెంట్ స్టోర్లు, మార్ట్‌లు ఎంఆర్‌పీపై 3 నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్లు ఇస్తుంటాయి. ఉదాహరణకు ఒక మార్ట్‌లో లీటర్ ఫ్రీడమ్ ఆయిల్ ఎంఆర్‌పీ రూ.173 ఉంటే 25 శాతం డిస్కౌంట్‌తో రూ.148కు విక్రయిస్తున్నారు. ఆదివారం గ్రాస్ అమౌంట్ రూ.130.24+ జీఎస్టీ రూ.17.76 (12 శాతం) కలిపి రూ.148 బిల్లు చేశారు. కొత్త జీఎస్టీ అమలుతో సోమవారం అదే ఆయిల్ ఎంఆర్‌పీపై 20 శాతం డిస్కౌంట్ సేల్ పెట్టి గ్రాస్ అమౌంట్ రూ.140.6 ప్లస్ జీఎస్టీ రూ.7.4 కలిపి రూ.148 బిల్లు చేస్తున్నారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం డిపార్టుమెంట్ స్టోర్లు కూడా డిస్కౌంట్ తగ్గించి 21వ తేదీ వరకు ఉన్న ధరలకే సర్దుబాటు చేస్తున్నాయి. అందువల్ల నిత్యావసర వస్తువులపై తగ్గిన జీఎస్టీ పెద్ద ప్రభావం చూపలేకపోయింది. ఇక వీధుల్లో కిరాణా దుకాణాల్లో అయితే జీఎస్టీతో సంబంధమే లేదు. అక్కడ బిల్లులు ఏమీ ఉండవు. దుకాణదారులు నిర్ణయించుకున్న ధరకు వినియోగదార్లు కొనుగోలు చేసుకోవాల్సిందే.



స్వర్ణ కవచ అలంకరణలో కనకమహాలక్ష్మి

స్వర్ణకవచ అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మహారాణిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో వేదపండితులు అర్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఆదిలక్ష్మి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఉక్కు సమస్యలపై కలెక్టర్ దృష్టి



- రెండు రోజుల క్రితం నగరానికి విచ్చేసిన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సెక్రటరీతో భేటీ
- నిర్వాసితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి
- తొలగించిన నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి
- విమల విద్యాలయం కొనసాగించాలని సూచన

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు సమస్యల పరిష్కారంపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిర్వాసిత కాంట్రాక్టు వర్కర్లను కూడా స్టీల్ ప్లాంటు యాజమాన్యం తీసేసిన నేపథ్యంలో వారికి న్యాయం చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం స్టీల్ ప్లాంటుకు ఢిల్లీ నుంచి స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రీ రాగా కలెక్టర్ ప్లాంటుకు వెళ్లి ఆయన్ను ప్రత్యేకంగా కలిశారు. స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు భూములు ఇచ్చి నిర్వాసితులుగా మారిన వారికి ఉపాధి కల్పించాలని చట్టంలో ఉందని, ఇంకా ఎనిమిది వేల మందికి ఉపాధి లేదని సెక్రటరీకి వివరించారు. ఉపాధి కల్పన ... మిగతా 6వ పేజీలో

రైళ్లు కిటకిట

దసరా ప్రయాణాలు మొదలు

- కిక్కిరిసిన రైల్వే స్టేషన్
- ప్రధాన రైళ్లలో వచ్చే నెల మొదటి వారం వరకూ బెర్తులు రిజర్వు



రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ వద్ద ప్రయాణికుల రద్దీ

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా ప్రయాణాలు మొదలయ్యాయి. సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడం, విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో రైళ్లకు తాకిడి పెరిగింది. సోమవారం విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరిన రైళ్లు కిక్కిరిశాయి.

కిటకిటలాడిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్

సోమవారం మధ్యాహ్నం విజయవాడ బయలుదేరిన రత్నాచల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ కిటకిటలాడింది. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది చేపట్టిన చర్యల కారణంగా రైలు ప్రవేశ ద్వారం వద్ద ఎక్కే, దిగే ప్రయాణికులు నియంత్రణ పాటించడంతో ఎటువంటి ఘటనలు చోటుచేసుకోలేదు.

సికింద్రాబాద్ రైళ్లకు సాధారణ డిమాండ్

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైళ్లలో గరీబ్‌రథ్ (12837), గోదావరి (12727) ఎక్స్‌ప్రెస్‌లకు అక్టోబరు 12 వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) రైళ్లకు సాధారణ డిమాండ్ నెలకొంది. ఈ రైళ్లకు ఈ నెల 28 వరకు బెర్తులు నిండిపోగా, దసరా ముందురోజు కొన్ని క్లాసులలో బెర్తులు/ఆర్‌ఏసీ లభించే పరిస్థితి ఉంది. అలాగే విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833), మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరే వందేభారత్ (20708) రైళ్లకు దసరా ముందురోజు సీట్లు అందుబాటులో ఉన్నాయి. విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805)కు అక్టోబరు 6 వరకు ఏసీ చైర్‌కార్ సీట్లు నిండిపోయాయి. ప్రతి బుధ, శనివారం నడిచే విశాఖ-నాందేడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20811), ప్రతి ఆది, మంగళ, గురువారం నడిచే దురంతో ... మిగతా 6వ పేజీలో

మసాజ్ సెంటర్లపై నిఘా

- లాడ్జిలపై కూడా...
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఫిర్యాదులు
- ఆకస్మిక తనిఖీలకు సీపీ ఆదేశం
- ఒక స్టేషన్ పరిధిలో వేరొక స్టేషన్ పోలీసులతో దాడులు
- బయటపడుతున్న చీకటి కార్యకలాపాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో మసాజ్ సెంటర్లు, లాడ్జిలపై పోలీసులు నిఘా పెంచారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయనే ఫిర్యాదులు అందుతుండడంతో సీపీ శంఖబ్రతబాగ్చీ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో హోటళ్లు/లాడ్జిలు, మసాజ్ సెంటర్లపై వేరొక స్టేషన్ పరిధిలోని పోలీసులతో ఆకస్మిక దాడులు చేయిస్తున్నారు. వారికి అదనంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో ప్రత్యేక నిఘా పెట్టడంతో ఇటీవల కాలంలో వరుసగా చీకటి కార్యకలాపాలు బయటపడుతున్నాయి. ఇటీవల కాలంలో థాయ్ స్పా, ఆయుర్వేదిక్ స్పా సెంటర్లు బాగా పెరిగిపోయాయి. ఒక మసాజ్ సెంటర్‌లో పనిచేసినవారు అక్కడ యజమానులకు వచ్చే ఆదాయాన్ని చూసి తాము కూడా సొంతంగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. కొంతమంది కస్టమర్లతో పరిచయాలు పెంచుకున్న తర్వాత సొంత దుకాణం తెరుస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 350కి పైగా మసాజ్ సెంటర్లు ఉన్నాయి. కాస్మోటిక్ అండ్ బ్యూటీషియన్ యాక్ట్‌కు లోబడిన సేవలను మాత్రమే మసాజ్ సెంటర్లలో అందజేయాలి. సెంటర్ ఏర్పాటుతోపాటు లోపల సదుపాయాల కల్పన కూడా యాక్ట్‌లో పేర్కొన్నట్టుగానే ఉండాలి. కానీ మసాజ్ సెంటర్ల నిర్వాహకులు మాత్రం స్పాల్లో మసాజ్ పేరుతో వ్యభిచారం నిర్వహించి కస్టమర్ల నుంచి భారీగా డబ్బులు వసూలుచేస్తున్నారు. పోలీసులతో తాము అవగాహన ఏర్పరచుకున్నందున దాడుల భయం ఉండదని కస్టమర్లకు భరోసా ఇస్తున్నారు. ఈ తరహా వ్యవహారాలు జరుగుతున్నట్టు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే నగరంలోని కొన్ని హోటళ్లు/లాడ్జిల్లో పేకాట, వ్యభిచారం నడుస్తున్నాయి. ఇలాంటి ... మిగతా 6వ పేజీలో

జీఎస్‌టీపై బీజేపీ ర్యాలీ



జీఎస్టీ శ్లాబుల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని దొండపర్తి నుంచి అక్కయ్యపాలెం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, పార్టీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, తదితరులు పాల్గొన్నారు. - మెయిన్‌లో

24న విజయవాడకు డీఎస్సీ అభ్యర్థులు

- 25న నియామక పత్రాల అందజేత
- వచ్చే నెల మూడో తేదీ నుంచి నూతన ఉపాధ్యాయులకు శిక్షణ
- 10న కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికైన 1,134 మంది ఈనెల 24న విజయవాడ బయలుదేరనున్నారు. ఆరోజు ఉదయం ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం నుంచి బస్సులు బయలుదేరతాయి. అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరిని అనుమతించనున్నారు. ఈ నెల 25వ తేదీన ... మిగతా 6వ పేజీలో

చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించాలి



- ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

-8లో

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

ఐటీ హబ్‌గా విశాఖ

ఈ-గవర్నెన్స్ సదస్సులో ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఐటీ హబ్‌గా మారనుందని, ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయని రాష్ట్ర ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ వెల్లడించారు. విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో సోమవారం ప్రారంభమైన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో ఆయన 'ఐటీ హబ్‌గా విశాఖ' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పది శాతం వార్షిక వృద్ధి రేటుతో స్వర్ణాంధ్ర-2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మారేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. దూరదృష్టితో గ్రీన్ కారిడార్లు నిర్మిస్తోందని, భవిష్యత్తులో రాష్ట్రం ప్రధాన ఇంధన ఎగుమతిదారుగా మారుతుందన్నారు. వ్యాపారాన్ని మరింత సులభతరం చేయడానికి 21 రోజుల్లోనే చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 నానో, ఎంఎస్ఎంఈ పార్కులను ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో నిర్మిస్తోందని, వీటి ద్వారా రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఏపీ జనాభాలో 71 శాతం మంది కష్టపడి పనిచేసే వయస్సులో ఉన్నారని, ఇది చక్కటి అవకాశమన్నారు. 3.8 కోట్ల మందికి డిజిటల్ స్కిల్ కార్యక్రమం రూపొందించామని, ఆన్‌లైన్ ద్వారా నైపుణ్యం పేరుతో అప్‌స్కిల్లింగ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పరిశ్రమకు-ప్రతిభకు మధ్య అంతరం తగ్గిస్తున్నామన్నారు. ఒరాకిల్, ఇన్ఫోసిస్, సిస్కో, మైక్రోసాఫ్ట్ తదితరులతో వీటి కోసం పనిచేస్తున్నామన్నారు.

విశాఖలో ప్రస్తుతం కాండ్యుయెంట్, విప్రో, పాత్ర, టెక్ మహీంద్రా, కాన్‌సెంట్రిక్స్, ర్యాండ్ స్టాండ్, మౌరీ టెక్, డబ్ల్యుఎన్ఎస్, ఏసీఎన్, ఇన్ఫోసిస్, అదానీ వంటి సంస్థలు ఉన్నాయన్నారు. ఐటీ ఇన్నోవేషన్‌కు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, జాతీయ రహదారులు విషయంలో మూడో స్థానంలో ఉందన్నారు. దేశంలో 14వ పెద్ద నగరమని, పర్యాటకులు సందర్శించే ఐదో నగరమని, జీడీపీలో 9వ నగరమని, పరిశుభ్రమైన నగరాల్లో నాలుగోదని, ఏటా 20 వేల గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఇంజనీరింగ్, ఐటీ, ఏఐ వంటి రంగాల్లో బలమైన విద్యా సంస్థలు ఉన్నాయన్నారు. మొత్తం 250 విద్యాసంస్థలు ఉండగా వాటిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం, ఐఐపీఈ నైపుణ్యం కలిగిన యువతను అందిస్తున్నాయన్నారు. ఐఐఎం, ఏపీఎస్‌డీసీ వంటివి ఎకో సిస్టమ్ అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయన్నారు. మెరైన్ సైన్స్, బయో టెక్నాలజీ, పెట్రోలియం, పర్యావరణ రంగాల్లో పరిశోధనలకు అవకాశం ఉందన్నారు. ఈ సదస్సులో కాగ్నిజెంట్ ప్రతినిధి గౌరవ్ హజ్రా, సిఫీ ఇనిఫినిటీ సీఈఓ శరద్ అగర్వాల్, సుందరి పాటి బండ్ల, వంశీకృష్ణ జడాల తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల హౌస్ అరెస్టు

మధురవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వామపక్షాల పోరాటాలను ఎదుర్కొనలేక కూటమి ప్రభుత్వం హౌస్ అరెస్టులకు పాల్పడుతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు విమర్శించారు. చిల్లర వర్తకులు, స్ట్రీట్ వెండర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు పీఎంపాలెం పోలీసులు సోమవారం ఉదయమే మధురవాడ, నగరంపాలెంలో ఉన్న సీపీఐ నాయకులు పైడిరాజు, వాండ్రాసి సత్యనారాయణను హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ ఆక్రమణల పేరుతో దుకాణాలు తొలగించడంతో వందలాది మంది చిరు వ్యాపారులు, స్ట్రీట్ వెండర్లు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారని తెలిపారు. వారి తరఫున పోరాడుతున్న వామపక్షాల నాయకులను హౌస్ అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

కొమ్మాది, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తూ వివిధ కారణాలతో నిలిచిపోయిన, చనిపోయిన కార్మికుల వారసులకు ఆప్కాస్ ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు జోన్-2 కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహం వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన వారు, రిటైర్డ్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఏళ్లు కావస్తున్నా పట్టించుకోక పోవడం అన్యాయమన్నారు. అనంతరం ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, వి. నరేంద్రకుమార్, కార్యకర్తలు నాగరాజు, ఓ. లక్ష్మి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టాభిరామ్‌కు సత్కారం


పట్టాభిరామ్‌ను సత్కరిస్తున్న నాయకులు

విశాలాక్షినగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన చోడే వెంకట పట్టాభిరామ్‌ను ఆయన కార్యాలయంలో 9వ వార్డు టీడీపీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వార్డుకు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పార్టీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, దబ్బి వెంకట్రావు, గరికిన నూకరాజు, నబ్బి శివ, బోర సాయి, శివకేశవ రెడ్డి, పెంటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్చ...

... 5వ పేజీ తరువాయి

అమలుచేశారు. మిల్క్, చీజ్, నెయ్యిలపై తగ్గింపు ధరలు అందుబాటులోకి వచ్చాయి. పాలు (లీటరు)పై రూ.3 వరకు తగ్గగా, 500 గ్రాముల నెయ్యిని కంపెనీని బట్టి రూ.20 నుంచి రూ.40 వరకు తగ్గించారు. పన్నీర్ ధర కిలోకు రూ.20 నుంచి రూ.25 వరకు తగ్గింది. మిల్క్ షేక్‌లు, ఫ్లమ్ కేక్స్‌పై రెండు నుంచి ఐదు రూపాయల వరకు తగ్గింది. కాగా మరికొన్ని కంపెనీలు పాత ధరలకే విక్రయిస్తున్నాయి. 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో కార్లు, బైక్‌ల ధరలు దిగి వచ్చాయి. కంపెనీ ధరను బట్టి కనిష్ఠంగా రూ.ఆరు వేల నుంచి రూ.15 వేలు వరకు తగ్గింది. కార్ల ధరలు భారీగా తగ్గాయి. ఒక్కో కారుపై రూ.60 వేల నుంచి రూ.1.1 లక్షల వరకు తగ్గినట్టు షోరూమ్ యజమానులు చెబుతున్నారు.

హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు భారీగా రేట్లు తగ్గించాయి. ఇద్దరు పిల్లలున్న కుటుంబానికి (వయసును బట్టి) రూ.10 లక్షల పాలసీకి ఇప్పటివరకూ రూ.24 వేల నుంచి రూ.28 వేల వరకు వసూలు చేస్తుండగా, దీనిపై జీఎస్టీని పూర్తిగా మినహాయించడంతో రూ.19 వేల నుంచి రూ.20 వేల మధ్య అందుబాటులోకి వచ్చాయి. ఇక ఏసీ, డిష్ వాషర్, టీవీలు 28 శాతం నుంచి 18 శాతం శ్లాబుల్లోకి మార్చడంతో ధరలు తగ్గాయి. సామర్థ్యాన్ని బట్టి ఏసీపై రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు, డిష్ వాషర్‌పై రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, టీవీలపై రూ.4 వేల నుంచి రూ.పది వేలు తగ్గించి విక్రయిస్తున్నారు.

తగ్గని వస్తువులు ఇవే..

జీఎస్టీ శ్లాబులు మేరకు ధరలను తగ్గించి విక్రయించాలని కేంద్రం ఆదేశించినప్పటికీ అనేక మంది వ్యాపారులు పట్టించుకోలేదు. పౌడర్, షాంపూ, హెయిర్‌ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్, కేక్, బిస్కెట్స్, కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్, ఐస్‌క్రీమ్స్, మినరల్ వాటర్, మెడిసిన్స్ ధరలు తగ్గలేదు. వస్త్రాలు, ఫుట్‌వేర్, మందులకు పాత ధరలే వసూలు చేశారు. అయితే బిల్లులో తగ్గిన జీఎస్టీలను చూపిస్తూ డిస్కౌంట్ రేట్లను పెంచి వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా తాము ఇప్పటికే జీఎస్టీ చెల్లించి సరకులు కొనుగోలు చేశామని, వాటిని తగ్గించి విక్రయిస్తే నష్టపోతామని కొందరు వ్యాపారులు...వినియోగదారులతో వాదనకు దిగారు. అయా శ్లాబులకు అనుగుణంగా తగ్గిన ధరలతో కూడిన బోర్డులను ఏర్పాటుచేయాలని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్ ఇచ్చిన ఆదేశాలను ఎక్కడా అమలు చేయడం లేదు. కొద్దిచోట్ల మాత్రం 'తగ్గించిన జీఎస్‌టీ రేట్లు వర్తింపజేస్తున్నాము' అంటూ బోర్డులు పెట్టారు తప్ప ధరల వివరాలేవీ కనిపించలేదు.


ఎండాడలో దుర్గాదేవి


గీతంలో రాజరాజేశ్వరి అమ్మవారు


మానం ఆంజనేయనగర్‌లో లలిత త్రిపుర సుందరీదేవి


చంద్రంపాలెంలో దుర్గాలమ్మ

వాడవాడలా శరన్నవరాత్రుల సందడి

భీమునిపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజవర్గంలోని అన్ని మండలాల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భీమిలి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నూకాంబికా ఆటో డ్రైవర్స్ సంఘం ఆధ్వర్యంలో, గొల్లవీధి శ్రీకృష్ణ జంక్షన్, ఎగువపేట సామాజిక వేదిక వద్ద మండపాలు ఏర్పాటు చేసి, దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించారు. పాత బస్టాండ్‌లో పట్టణ పురోహితుడు సుసరాపు కామేశ్వర మాధవ శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో నూకాంబికా ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి వియ్యపు ఎర్రిబాబు, గండిబోయిన వెంకటరావు, వియ్యపు అప్పలనారాయణ పాల్గొన్నారు. చిన్నబజారు జమ్మి చెరువు గట్టు వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలోను, శివకేశవ ఆలయ ఆవరణలో ఉన్న కాత్యాయిని అమ్మవారి ఆలయంలోను, బీచ్ రోడ్‌లో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, శారదా రామకృష్ణ సమాజంలోనూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బీచ్‌రోడ్‌లో మంగమారిపేట జంక్షన్, ఈబీసీ కాలనీ జంక్షన్‌లోనూ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.


సింహాచలంలో అమ్మవారికి పూజలు

మానం ఆంజనేయనగర్‌లో..

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మానం ఆంజనేయనగర్‌లోని లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని తొలిరోజు బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బింద్రానగర్‌లోని నూకాంబిక ఆలయం, స్వతంత్రనగర్ కాలనీలోని పలు ఆలయాల్లోనూ వేడుకలు ప్రారంభమయ్యాయి.

ఎండాడలో...

ఎండాడ :జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజల్లో భాగంగా పువ్వులు, పత్రితో అర్చన చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి శాఖరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కూడా అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

క్షేత్ర పాలకుని సన్నిధిలో..

సింహాచలం : సింహగిరి క్షేత్ర పాలకుడు బాలా త్రిపుర సుందరి సహిత త్రిపురాంతక స్వామి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఏటా ఆశ్వీయుజ మాస శుక్ల పక్ష పాడ్యమి నుంచి దశమి వరకు ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు సోమవారం ప్రభాతారాధనలు తరువాత ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం త్రిపురాంతకునికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. తరువాత బాలత్రిపుర సుందరి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు జరిపారు. అలాగే 98వ వార్డు విజినిగిరిపాలెంలో ఉమా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో, ఆయిల్ మిల్ ఎదురుగా గణేశ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో, గాంధీనగర్‌లో హనుమాన్ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారి విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం కలశ స్థాపన చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు, అభిషేకాలు చేసి బాలత్రిపురసుందరిగా అలంకరించారు. ఈ సందర్భంగా సహస్రనామ కుంకుమార్చనలు, హోమం చేసి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో..

సాగర్‌నగర్ : మొగదారమ్మ మహాలక్ష్మీ పద్మాలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సూరపునేని లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు సుప్రభాతసేవ, 6.15 గంటలకు ప్రాతకాలార్చన, 7.15 గంటలకు బాల భోగం నివేదన, నీరాజనం, మంత్రపుష్పము తీర్థ ప్రసాద వితరణ, 8.45 గంటలకు అమ్మవారు పూజా మండప ప్రవేశం ఉంటాయన్నారు. దుర్గాష్టమి రోజున ఉదయం 10.30 నుంచి చండీ హోమం, సాయంత్రం 7 గంటలకు పుష్పాభిషేకం జరుగుతాయని తెలిపారు. విజయదశమి రోజున శమీ పూజ, ఆరోజు సాయంత్రం శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయని చెప్పారు.

పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభం, మద్ది, విజయానందపురం, పొట్నూరులో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి విగ్రహాలను డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా మండపాలకు తీసుకువచ్చి నిలిపారు. తొలిరోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. మద్ది సాగర దుర్గ ఆలయంలో గోపూజ, కుంకుమ పూజ నిర్వహించారు. గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో ఉమామహేశ్వరి అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రాంబాబు, సర్పంచ్ సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, పద్దు, శేషు, రవి, రాము, టి. అప్పలనాయుడు పాల్గొన్నారు.


భీమిలిలో ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు


మద్దిలోని సాగర దుర్గ ఆలయంలో అమ్మవారికి పూజలు

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమ వారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడపశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళం


విరాళం ఇస్తున్న దాత

సింహాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి అనకాపల్లికి చెందిన సున్నం చంద్రకాంత్, అమృత దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు.విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి సునీల్‌కు సోమవారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించారు.


జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న వీధి విక్రయదారులు

వీధి విక్రయదారుల ధర్నా

కొమ్మాది, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జోన్- 2 కార్యాలయం ఎదుట వీధి విక్రయదారులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపు పేరుతో తమ బతుకులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి, తమకు ఉపాధి కల్పించాలని కోరారు. అప్పటివరకు రోడ్లపై వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతించాలన్నారు. ఈమేరకు జడ్సీ కనక మహాలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రికి వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు.

ఐటీ సేవలు మరింత విస్తృతం

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. మంచి పనులు చేసేటపుడు కొన్ని ఇబ్బందులు వస్తాయని, వాటిని అధిగమించాలని సీఎం సూచించారు. నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని, ఆక్రమణలు తొలగించిన స్థానంలో మళ్లీ వ్యాపారాలు చేయకుండా బాధ్యత తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో పనిచేసే టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఈ ఆక్రమణల పట్ల అప్రమత్తం చేయాలని చెప్పారు. వీటిని ఎవరు ప్రోత్సహించవద్దని, సిబ్బంది సహకరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు ఇలాంటి అంశాల జోలికి పోకుండా తాను సూచనలు చేస్తానని హామీ ఇచ్చారు.



సదస్సులో ప్రసంగిస్తున్న గీతం ప్రో వీసీ వై. గౌతమ్‌రావు

పంటల సాగులో మార్పు అవసరం

సాగర్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని వ్యవసాయ రంగంలో నాణ్యతతో కూడిన పంటలను వృద్ధి చేయడానికి కృత్రిమ మేధ ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు పేర్కొన్నారు. సోమవారం గీతం వర్సిటీ వేదికగా గువహటిలోని ఐఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐసీటీ అకాడమీ, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ అన్న అంశంపై జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డీపీ) కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా నిపుణులు వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. కృత్రిమ మేధ రానున్న రోజుల్లో వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణ వైపు నడపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గీతం వర్సిటీ ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, ఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ భరణి చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో ఆకతాయిల బెడద

భీమునిపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆకతాయిల బెడద ఎక్కువైంది.ముఖ్యంగా పాతబస్టాండ్, ప్రభుత్వ జూనియరు కళాశాల వద్ద ఈ పరిస్థితి దారుణంగా ఉంది. జూనియర్ కళాశాల ప్రారంభ సమయంలోను, ఇంటర్వెల్, విడిచిపెట్టేటపుడు ఆకతాయిలు బైకులపై జోరుగా చక్కర్లు కొడుతూ బాలికలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కళాశాల ఆరు బయట ఉంటూ వచ్చీ వెళ్లేవారిని కామెంట్లు చేస్తున్నారు. పోలీసులు ఈ సమస్యపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిరు వ్యాపారులకు న్యాయం చేయండి

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని వీధి విక్రయదారుల బడ్డీలను అక్రమంగా తొలగించడాన్ని ఆపడంతోపాటు ఇప్పటికే తొలగించిన వారికి ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డాల వర్మరాజు ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్‌కు వెళ్లి ఆర్డీవోను కలిశారు. అనంతరం వర్మరాజు మాట్లాడుతూ చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించడం హేయమైన చర్యన్నారు. నోటీసులు ఇవ్వకుండా తొలగించి వారి పొట్టలు కొట్టారనిన్నారు. కుటుంబ పోషణ కష్టంగా మారి ఇబ్బందులు పడుతున్నారని, వారికి అండగా నిలవాలని కోరారు. దీనిపై కలెక్టర్‌తో మాట్లాడి చిరు వ్యాపారులకు నష్టంగా జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేసేందుకు కృషిచేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, కమలాకర్, గాదం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చాక్లెట్లు, లేస్ ప్యాకెట్లతో దుర్గమ్మకు అలంకరణ



అగనంపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రుల సందర్భంగా జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి పోస్టాఫీస్ వద్ద గల దుర్గమాంబ ఆలయంలో అమ్మవారిని చాక్లెట్లు, లేస్ ప్యాకెట్లతో సుందరంగా అలంకరించారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. విజయదశమి వరకు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్ తెలిపారు.

కిరండూల్ పాసింజర్‌కు అదనపు కోచ్

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగిస్తున్న 58501, 58502 నంబర్లు గల పాసింజర్ రైళ్లకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ క్లాసు కోచ్‌ను అదనంగా జత చేస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.

24న విజయవాడకు డీఎస్సీ అభ్యర్థులు

... 5వ పేజీ తరువాయి

అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేస్తారు. విజయవాడలో నియామక పత్రాలు అందుకున్న తరువాత తిరిగి జిల్లాకు తీసుకువస్తారు. అలాగే దసరా సెలవులు ముగిసిన తరువాత అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు నూతన ఉపాధ్యాయులకు కేటగిరీల వారీగా శిక్షణ ఇస్తారు. ఇందుకు సబ్బవరం, రుషికొండ ఐటీ హిల్స్‌లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. శిక్షణ చివరిరోజు పదో తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అందుకు ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీల వివరాలను సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పాడేరు డివిజన్, అనకాపల్లి జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. వీటిని ఈ పర్యాయం భర్తీ చేస్తారు. ఈ ఏడాది జూన్‌లో చేపట్టిన కౌన్సెలింగ్‌లో మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీలో పనిచేస్తూ బదిలీ అయినవారు చాలామంది ఇప్పటివరకూ రిలీవ్ కాలేదు. ఆయా పోస్టుల్లోకి వెళ్లేందుకు టీచర్లు లేకపోవడమే అందుకు కారణం. డీఎస్సీలో ఎంపికైన టీచర్లను అక్కడకు పంపి, వారిని రిలీవ్ చేస్తామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఉక్కు సమస్యలపై కలెక్టర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

కేంద్రం ద్వారా వచ్చే జాబితా ప్రకారం దశల వారీగా వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మే నెలలో 200 మందికిపైగా నిర్వాసిత కాంట్రాక్టు వర్కర్లను తొలగించారని, తక్షణం వారిని తిరిగి తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా నిర్వాసిత కుటుంబాల కోసం ప్లాంటు యాజమాన్యం సహకారంతో నడుస్తున్న విశాఖ విమల విద్యాలయాన్ని కొనసాగించాలని అభ్యర్థించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొనసాగించలేని పక్షంలో అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఆ విద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే ఎయిడెడ్ సిబ్బంది ద్వారా దానిని నడిపిస్తామని, తద్వారా ఆ ప్రాంత పేద పిల్లలకు విద్య అందుతుందన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని సూచించారు. ఈ సమస్యల పట్ల స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే తగిన నిర్ణయాలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

మసాజ్ సెంటర్‌లపై నిఘా

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపకపోతే సమస్య మరింత తీవ్రంగా మారి నగరంలో శాంతిభద్రతల సమస్యకు దారితీయడం ఖాయమని గుర్తించిన సీపీ శంఖబ్రతబాగ్చి హోటళ్లు/లాడ్జిలు, మసాజ్ సెంటర్లపై నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో మసాజ్ సెంటర్లు, హోటళ్లు/లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారిదేనని, ఏదైనా తేడా వస్తే అందుకు బాధ్యుడిని చేస్తానని సీపీ హెచ్చరించారు. అంతేగాకుండా ఒక స్టేషన్ పరిధిలోని హోటళ్లు/లాడ్జిలు, మసాజ్ సెంటర్లపై మరొక పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బందితో ఆకస్మిక దాడులు చేయిస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఇదే తరహాలో ఆకస్మిక సోదాలు జరుగుతుండడంతో వరుసగా చీకటి కార్యకలాపాలు బయటపడుతున్నాయి. కొద్దిరోజుల కిందట నగరంలోని ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో గల లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు బయటపడగా, మరో స్టేషన్ పరిధిలోని మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం గుట్టురట్టయింది. తాజాగా నగర శివారునున్న పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితోపాటు ఒక విటుడిని, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులు కొనసాగుతాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

రైళ్లు కిటకిట

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (22203)కు కొన్ని తేదీల్లో బెర్తులు/ఆర్ఏసీ అందుబాటులో ఉన్నాయి. విశాఖ మీదుగా నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703), కోణార్క్ (11020), ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వంటి దూరప్రాంత రైళ్లకు అక్టోబరు 10 వరకూ డిమాండ్ నెలకొంది.

చెన్నై, బెంగళూరు, హౌరా రైళ్లు రద్దీ

విశాఖ మీదుగా హౌరా, బెంగళూరు, చెన్నై వెళ్లే రైళ్లకు సోమవారం నుంచి మరింత రద్దీ పెరిగింది. చెన్నై, హౌరా మధ్య రాకపోకలు సాగించే కోరమండల్ (12842), మెయిల్ (12840), చెన్నై-సంత్రాగచ్చి (22808), చెన్నై-షాలిమార్ (22826) వంటి రైళ్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి హౌరా, చెన్నై చేరే రైళ్లు కిటకిటలాడాయి. అలాగే భువనేశ్వర్-బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-యశ్వంత్‌పూర్ (12863), భువనేశ్వర్-బెంగళూరు వంటి పలు రైళ్లు రద్దీగా నడిచాయి.



చంద్రబాబుతో నజీర్

సీఎం చంద్రబాబుకు నజీర్ స్వాగతం

రామ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఘనస్వాగతం పలికారు. సోమవారం విశాఖ ఈ గవర్నెన్స్ సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్దకు చేరుకున్నారు. ఆయనకు నజీర్ పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నజీర్ యోగ క్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.

చీఫ్ సెక్రటరీకి ఘన స్వాగతం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖలో రెండు రోజులు జరగనున్న 28వ జాతీయ ఈ గవర్నెన్స్ సదస్సుకు హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్‌కు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం విశాఖ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

'అంతిమ కోరిక' చిత్రానికి అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న జి.వి.త్రినాథ్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీలలో నగరానికి చెందిన రచయిత, నటుడు జి.వి.త్రినాథ్ రచన, దర్శకత్వంలో నిర్మితమైన 'అంతిమ కోరిక' లఘు చిత్రానికి ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు అవార్డులు లభించాయి. సోమవారం చుక్కపల్లి ఆడిటోరియంలో ఈ బహుమతి ప్రదానోత్సవంలో తెలుగు సినిమా డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్, మనసంతా నువ్వే దర్శకుడు ఆదిత్య, పురుషోత్తముడు దర్శకుడు వీరశంకర్ చేతులమీదుగా ఉత్తమ దర్శకుడిగా అవార్డును జి.వి.త్రినాథ్, ఉత్తమ నటుడు అవార్డును ఈ చిత్ర హీరో రాజీవ్ అందుకున్నారు. జీవీ త్రినాథ్ మాట్లాడుతూ తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రెండు అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సమాజహితమైన చిత్రాలను నిర్మించే చైతన్యం తీసుకువస్తామన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44,కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280



హనుమంతవాక జంక్షన్ సమీపంలో విజయదుర్గాదేవి



బాలా త్రిపుర సుందరి అలంకరణలో కనకమ్మ



వెంకోజీపాలెంలో ఏర్పాటు చేసిన ప్రతిమ



సంజయ్‌గాంధీ కాలనీలో దుర్గాదేవికి పంచామృతాభిషేకం



నీలాభిషేకం అనంతరం అలంకరించిన దుర్గా అమ్మవారు

దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డుల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 16వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలోని కనకదుర్గా ఆలయంలో మహిళలు తెల్లవారు జామున అమ్మవారికి పంచామృతాభిషేకాలు, నీలాభిషేకాలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయ అర్చకులు వెంకటరావు శర్మ భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు చేశారు. ఆలయం పక్కన ఉత్సవాలకు సంబంధించిన మండపం ఏర్పాటు చేసి, దుర్గాదేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, మురళి, సూర్యనారాయణ, మళ్ల దుర్గా తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో...

రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌బీకాలనీ హౌసింగ్ బోర్డు స్థలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతీ రోజు మహిళలతో ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. తొమ్మిది రోజులు ఉత్సవాల కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, రాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, ఇతర కమిటీ సభ్యులు, సీతారామ సేవా సంఘం అధ్యక్షులు కర్రి వెంకట సూర్య అప్పారావు పాల్గొన్నారు.

కొత్త వెంకోజీపాలెంలో...

కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కన ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా వీరాంజనేయ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. ఆటో స్టాండ్ నాయకులు మళ్ల రవికుమార్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. కొత్త వెంకోజీపాలెం గ్రామసేవా సంఘం కార్యాలయం సమీపంలోనూ, భూలోకమాత ఆలయంలోనూ దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.అలాగే ఇసుకతోట జాతీయ రహదారిపై గల కనకమ్మ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బాల త్రిపుర సుందరి అవతారంలో అలంకరించారు. దేవి బాయ్స్ ఆధ్వర్యంలో ఆలయం పక్కన మండపాన్ని ఏర్పాటు చేసి దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. సింహాలపై స్వారీ చేస్తున్న అమ్మవారి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది.

దుర్గామల్లేశ్వర ఆలయంలో ...

రామ్‌నగర్ : రామ్‌నగర్‌లోని దుర్గా మల్లేశ్వరి ఆలయంలో దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. రామ్‌నగర్ సెంటరులో వెలసి ఉన్న దుర్గా మల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలు, ఘటాలను పుర వీధులలో మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించారు. మహిళలు ప్రత్యేకంగా ఘటాలకు బిందెలతో నీళ్లు వేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా రామ్‌నగర్ వీధులు విద్యుత్ అలంకరణలతో కళకళలాడుతున్నాయి.

ఆరిలోవలో..

ఆరిలోవ : హనుమంతవంతవాక జంక్షను సమీపంలోని విజయదుర్గా కాలనీలో వెలసిన విజయదుర్గా దేవి సహిత విజయ గణపతి ఆలయంలో సోమవారం దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకుడు సంపత్‌కుమార్ శర్మ అమ్మవారికి ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, గులాబీలు, కలువ పద్మాలతో అలంకరించారు. ప్రతీ రోజు వివిధ అవతారాలలో అమ్మవారిని అలంకరిస్తారు. అక్టోబరు 1న అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చనలు చేస్తారు. అదేరోజు భక్తులందరికీ అన్న సమారాధన ఉంటుంది. ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎస్ఎన్‌రాజు, నాగభూషణం, డీవీఎల్ఎన్ స్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తారు.



కొత్త వెంకోజీపాలెంలో వీరాంజనేయ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో పూజలు

సాగర దుర్గా దర్శనానికి భక్తుల క్యూ

మహారాణిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగర దుర్గా అమ్మవారి దర్శనానికి మొదటి రోజే భక్తులు పోటెత్తారు. డాల్ఫిన్ నోస్ వద్ద సాగర తీరాన్ని బోటు ద్వారా దాటి ఆవల యారాడ కొండపై వెలసి ఉన్న సాగర కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం నుంచి బోటుపై వెళ్లేందుకు అనుమతులు ఇచ్చారు. దీనితో ఉదయం 7 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. హార్బర్ పోలీసు స్టేషన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్ఐ కేవీ ఆర్‌సీహెచ్ మూర్తిల ఆధ్వర్యంలో సిబ్బంది దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు క్యూ లైన్లు ఏర్పాటు చేసి బోటులో పరిమితంగా ఎక్కించి ఆవలకు పంపారు. క్యూలైన్లో పెద్ద ఎత్తున భక్తులు ఉండటంతో వారికి మంచినీరు, వైద్య సదుపాయం కల్పించారు. తొలిరోజే సుమారు రెండు వేల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి బోటు ద్వారా తరలివెళ్లారు.



రామ్‌నగర్‌లో ఘటాలతో ఊరేగింపు



భక్తులను బోటుపైకి పంపిస్తున్న హార్బర్ సీఐ సింహాద్రినాయుడు

విజయవంతంగా 'ఆపరేషన్ లంగ్స్'

- పరిశుభ్ర, ఆరోగ్యకర, సుందర నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- వీధి వ్యాపారులకు ప్రత్యేక విక్రయ జోన్లు
- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



వెంకోజీపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని పరిశుభ్ర, ఆరోగ్యకరమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో పార్కులు, ప్రధాన రహదారులు, జంక్షన్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, ప్రజలు, వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్ సౌలభ్యానికి అవకాశం కల్పించేందుకుగా 'ఆపరేషన్ లంగ్స్' చేపట్టామన్నారు. ఇప్పటివరకు 2,470పైగా ఆక్రమణలు తొలగించామన్నారు. దీంతో విశాలమైన రోడ్లు, అభివృద్ధి చేసిన ఫుత్‌పాత్‌లు, ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. నగర వాసుల సౌకర్యార్థం జీవీఎంసీ ఈ చర్యలు చేపట్టిందని వివరించారు. వీధి వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు వీలుగా వారిని క్రమపద్ధతిలో గుర్తించి,విక్రయ జోన్లలో దుకాణాలు కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. నగరంలో గతంలో నియంత్రణ లేకుండా ఆక్రమణలతో అనధికారికంగా ఏర్పాటుచేసిన ఫుడ్‌స్టాళ్లు, చిల్లర వ్యాపారాలుతో తరచూ ట్రాఫిక్ అంతరాయాలు ఎదురవుతుండేవన్నారు. ఫుట్ పాత్‌లను, రోడ్లను, జంక్షన్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అనధికార ఫుడ్ స్టాళ్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని వైద్య నిపుణులు హెచ్చరించారన్నారు.ఇలాంటి అనారోగ్యకరమైన, హానికరమైన ఆహార స్టాళ్లను కట్టడి చేసి, ఆహార భద్రతను నిర్ధారించడం, సురక్షితమైన ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడమే జీవీఎంసీ ఉద్దేశమని కమిషనర్ స్పష్టం చేశారు. 'ఆపరేషన్ లంగ్స్' ఎవరికీ వ్యతిరేకం కాదని, అపోహలు,అసత్య ప్రచారాలు నమ్మవద్దని, నగర ప్రజల ఆరోగ్యం, భద్రత, సౌకర్యం కోసం ప్రారంభించామన్నారు. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన విశాఖ నగరాన్ని అందుబాటులోకి తేవడమే జీవీఎంసీ లక్ష్యమన్నారు.

అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకం



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళా రంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సినీ రంగానికి ఎనలేని సేవలందించిన పద్మవిభూషణ్, దాదాఫాల్కే అవార్డు గ్రహీత డా.అక్కినేని నాగేశ్వరరావు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని పలువురు కళారంగ ప్రముఖులు అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలోని స్వరమాధుర్యం, ఎంవీఆర్ సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అక్కినేని చిత్ర గీతాష్టమి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మనోపల్లా, బాచి, ఇమంది రమణ, భయ్యా శ్రీనివాస్, ఎంవీఆర్ నాగేశ్వరరావు, డెండేటి భూపతిరావు, సన్‌మూర్తి, ఫణిస్వామి, పట్టం వెంకటేష్, మంజు, రుద్రప్రసాద్, ఉషచీరాల, బాబ్జిపల్లా, వెంకట్ అక్కినేనిలు విచ్చేసి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సినీ రంగానికి అక్కినేని అందించిన సేవలు మరవలేనివన్నారు. జీవితాంతం నటిస్తూనే ఉన్నారన్నారు. ఆయన నటించిన భక్తి చిత్రాల ద్వారా ప్రజల్లో చెరగని ముద్రవేశారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన సేవలను గుర్తించి అందించిన అవార్డులు ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. తదుపరి గాయనీగాయకులు రాజేంద్రప్రసాద్, సాత్విక, రామనరసింహం, రంజిత, రామ్ సుజాత, అక్కినేని నటించిన గీతాలను ఆలపించి అలరించారు.

తుక్కు.. ప్రజల ప్రాణాలకు ముప్పు

- రోడ్లపై విచ్చలవిడిగా వ్యాపారం
- నివాసితుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



నివాసాల మధ్య ఉన్న దుకాణం



దుకాణంలో తుక్కు మూటలు

బీచ్ రోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో తుక్కు దుకాణాల నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వన్ టౌన్‌లోని రామకృష్ణ థియేటర్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో నడిరోడ్డు మీద విచ్చలవిడిగా తుక్కు (స్క్రాప్) వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ దుకాణాలు నివాసాల మధ్య ఉండడంతో దోమలు వృద్ధి చెంది, జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఒకవైపు శబ్ద కాలుష్యం, మరోవైపు దుమ్ము, ధూళితో నానా అవస్థలు పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తుక్కు వ్యాపారులు పని చేస్తుండడంతో వాటి నుంచి వెలువడే శబ్దంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, సంచులు, తుప్పు పట్టిన వాషింగ్ మెషిన్లు, బీరువాలు, ఫ్రిజ్‌లు, పేపర్లు, అట్టలు, ఇనుప ఊచలు, ఇనుప రాడ్లు, పనికిరాని ఎలక్ట్రికల్ వస్తువులు, విరిగిన కుర్చీలు ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, పాతబడిన కార్లు విడిభాగాలు చేసి విక్రయిస్తుంటారు. దుకాణాల్లో ఈ నిల్వలు పేరుకుపోతున్నాయి. వీటి నుంచి వచ్చిన దుర్వాసన, ధూళితో స్థానికులు ఇబ్బందులు పడడంతో పాటు వర్షం నీరు వాటిలో చేరి నిల్వ ఉండిపోతోంది. ఆ నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అవి పరిసరాల్లోని నివాసాల్లోకి చేరి స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. అలాగే వ్యాపారానికి వినియోగించుకుంటున్న ఆయా స్థలాల్లో వందల కొద్దీ తుక్కు మూటలను నిల్వ చేస్తున్నారు.వాటిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చినప్పుడు, దుకాణం నుంచి వేరేచోటకు తరలించేటప్పుడు వ్యాన్‌లతో హడావుడి చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు చిన్నది కావడం, నివాసాల మధ్య రాత్రి, పగలు వాహనాలతో సరకును తరలిస్తుండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే నిర్వహిస్తున్న తుక్కు దుకాణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, మూటలను రోడ్డు మీద నిల్వ చేస్తున్నారు. వాటిని వ్యాన్‌లతో తరలించేటప్పుడు వచ్చే దుర్వాసన భరించలేని విధంగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా ఈ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీటిని జనావాసాలకు దూరంగా తరలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎంవీపీ కాలనీ రెండు, ఆరో సెక్టార్లను కలిపే ప్రధాన రహదారిలో పశువులు

రోడ్లపై పశువుల సంచారంతో ఇబ్బందులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చక్కని ప్రణాళిక గల ఎంవీపీ కాలనీలో అధిక శాతం ఉన్నత వర్గాలే నివాసం ఉంటున్నాయి. కానీ రహదారులు మాత్రం పశువుల సంచారంతో ప్రమాదాలను ఆహ్వానిస్తుంటాయి. వీటి కారణంగా పలుసార్లు ద్విచక్రవాహనదారులు ఇబ్బందిపడిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా వెంకోజీపాలెం నుంచి మెడికవర్ ఆసుపత్రి వెనుక భాగంలోని రెండు, ఆరో సెక్టరును కలిపే ప్రధాన దారిలో వీటి సంచారం ఎక్కువగా ఉంటుంది. హెల్త్‌ఎరీనా, డీఆర్‌డీఏ కార్యాలయం వరకూ ఉన్న ఈ రహదారిలో ఇరువైపులా నివాసాలు ఉన్నాయి. కానీ ఇక్కడ ఎప్పుడూ రోడ్డుపై పశువులు సంచరిస్తూనే ఉంటాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, చిన్నారులు భయపడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఏ పశువు ఎప్పుడు దాడికి పాల్పడుతుందోనన్న భయంతో ఇక్కడివారున్నారు. ఎంవీపీ సర్కిల్ నుంచి డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లే దారిలో పశువులు రోడ్డు మధ్యలో తిష్టవేస్తున్నాయి. రోడ్లపై పశువుల సంచారంపై నిషేధం ఉంది. జీవీఎంసీ సిబ్బంది వీటిని గుర్తించి పెంపకందారులకు జరిమానా వేస్తుంటారు. ఇక్కడ మాత్రం అధికారులు ఎందుకో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సమష్టి కృషితో లక్ష్యాలు సాకారం



సెమినార్‌లో పాల్గొన్న రోటరీక్లబ్ వాల్తేరు సభ్యులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో లక్ష్యాలు సాకారం అవుతాయని రోటరీక్లబ్ వాల్తేరు అధ్యక్షుడు ఎ.ఎస్.టి.భాస్కర్ చెప్పారు. మద్దిలపాలెంలోని కాకతీయ ఫంక్షన్ హాల్లో రోటరీక్లబ్ (వాల్తేరు) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భిన్నత్వం, సమతుల్యత, అంతర్భాగం చేయుట అనే అంశంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వం ద్వారా సమగ్రతను సాధించవచ్చన్నారు. ఐక్యత, వైవిధ్యం మధ్య సమతుల్యత సాధించడానికి వివిధ సమూహాల మధ్య తేడాలను గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. ముందుగా ఈ సదస్సును సర్వమత ప్రార్థనలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్తనశాల నాట్యశాల చిన్నారులు దేశంలోని తొమ్మిది రకాల నృత్యాలతో ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు సత్యశ్రీ, దెందుకూరి సుహాసిని, నందిని, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ్‌చక్రవర్తి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ప్రభుత్వ స్థలం



ఆక్రమణకు గురవుతున్న స్థలం

ఆనందపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జంక్షన్‌లో హైవే బ్రిడ్జి కింద డైవర్షన్ రోడ్డు పక్కనున్న స్థలం ఆక్రమణకు గురవుతోంది. విశాఖ నుంచి వచ్చే వాహనాలు ఆనందపురం జంక్షన్‌లో ఊరులో నుంచి డైవర్షన్ మార్గం ద్వారా హైవేపైకి వెళ్లాల్సి ఉంది. వాహనాలు తిరిగే రోడ్డు ఆక్రమణకు గురవ్వడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అసలే ఇక్కడి రోడ్డు ఇరుకు.. పైగా ఆక్రమణల వల్ల ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. పంచాయతీ అధికారులు ఆక్రమణదారుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి మిన్నకున్నట్టు తెలుస్తోంది.

పార్కుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం



పార్కులో సంచరిస్తున్న పశువులు

భీమునిపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్‌లో ఉన్న పార్కుల నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పార్కుల్లో పశువులు, కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వీటి వల్ల సందర్శకులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిసార్లు కుక్కలు, పశువులు పర్యాటకులపై దాడికి పాల్పడు తున్నాయి. రాత్రివేళ బీచ్ పార్క్, గాంధీ పార్క్ మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. చీకటి పడిన తరువాత ఆయా పార్కుల్లో పలు అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయి.

బాక్సింగ్ త్రీ స్టార్ రిఫరీ పరీక్షలో కిరణ్‌సాగర్, మురళీకృష్ణ ఎంపిక



కృష్ణసాగర్



మురళీకృష్ణ

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాక్సింగ్ రిఫరీ అప్ గ్రేడింగ్ పరీక్షలలో నగరానికి చెందిన వాల్తేరు రైల్వే బాక్సింగ్ క్రీడాకారులు కిరణసాగర్, మురళీకృష్ణ ఉత్తీర్ణులయ్యారు. నొయిడాలో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రిఫరీ/జడ్జి అప్ గ్రేడేషన్ సెమినార్ కమ్ పరీక్షలలో కిరణ్‌సాగర్, మురళీకృష్ణ ప్రతిభ కనబరిచి త్రీ స్టార్ రిఫరీ హోదా పొందారు. ఆంధ్రప్రదేశ్ నుంచి త్రీ స్టార్ రిఫరీ అర్హత సాధించిన తొలి బాక్సర్లుగా కిరణ్‌సాగర్, మురళీకృష్ణ ఘనత సాధించారు. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే బాక్సింగ్ క్రీడాకారులు, బాక్సింగ్ క్రీడా సంఘం ప్రతినిధులు వారికి అభినందనలు తెలిపారు.

పరిశీలక గృహాల తనిఖీ కమిటీ సభ్యుడిగా నరవ ప్రకాశరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలల రక్షణకు సంబంధించిన జువెనల్ జస్టిస్ చట్టం ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన బాలల పరిశీలకగృహాల పనితీరుపై తనిఖీ కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు.ఈ కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మూడేళ్ల కాల పరిమితిగల కమిటీ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ బాలల గృహాలు చట్ట నిబంధనలు పాటిస్తున్నాయా? లేదా? తనిఖీ చేసి నివేదికలు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందజేస్తాయి. ఈ కమిటీలో సభ్యునిగా నరవ ప్రకాశరావును నియమించడంపై వైజాగ్ ఎన్జీఓ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.


సీతమ్మధారలో బాల త్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు


నక్కవానిపాలెం మండపంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు


లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

చాక్లెట్లు, లేస్ ప్యాకెట్లతో దుర్గమ్మకు అలంకరణ



అగనంపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి పోస్టాఫీస్ వద్ద గల దుర్గమాంబ ఆలయంలో అమ్మవారిని చాక్లెట్లు, లేస్ ప్యాకెట్లతో సుందరంగా అలంకరించారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. వి జయదశమి వరకు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సీతమ్మధార/మురళీనగర్/కంచరపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ సంఘాల అధ్వర్యంలో కొలువుదీర్చిన పూజా మండపాల్లో దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. తొలి పూజలో 'శరణు భవానీ' అంటూ మాలధారణ భక్తులు, మహిళలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లో గల వినాయక, షిరిడి సాయి బాబా, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి అమ్మవారిని బాల త్రిపుర సుందరి అలంకరణలో, వెంకటేశ్వర స్వామిని పార్థ సారథిగా అలంకరించారు. వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అమ్మవారికి, అయ్యవారికి పూజలు జరిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక, అగర్వాల్‌లు పాల్గొన్నారు. నక్కవానిపాలెం అభయ దుర్గాదేవి ఆలయంలో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. న్యూ ఫ్రెండ్స్ అసోసియేషన్ దుర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో స్థానిక మహిళలు ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం సమీపంలో గల వివేకానంద కల్యాణమండపం ప్రాంతంలో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపం ఆకట్టుకుంది. భక్తులు, ప్రజలు, వాహనదారులు ఆసక్తితో అమ్మవారి మండపాన్ని దర్శించుకున్నారు. లక్కీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు గుప్తజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బర్మాక్యాంప్ రోడ్డు, మాధవధార బస్టాండ్ దగ్గర ఆటో యూనియన్, బిర్లా జంక్షన్ ప్రాంతాల్లో ఉత్సవ మండపాలు వెలిశాయి. మాధవధార సీతన్నగార్డెన్స్ ప్రాంతంలోని కనకమహాలక్ష్మి దేవాలయం, 50వ వార్డు హైస్కూలు దగ్గర లలితా దేవి మందిరం, 49వ వార్డు బర్మాక్యాంప్ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులతో ఆలయాలు శోభాయమానంగా దర్శనమిచ్చాయి. బర్మాక్యాంప్ పూజా మండపం వద్ద భక్తులకు తొలిరోజు వేడుకల్లో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెడ్డి కంచరపాలెం శ్రీరామా సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు జరిపారు. భవానీ మాలధారణ భక్తులు తొలిపూజల్లో పాల్గొన్నారు. గంగన్న నగర్, వాడపేట, సన్ రైజ్ క్లబ్, వివేకానంద వీధి, గొల్లకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, జైభారత్ నగర్, బర్మాక్యాంప్‌లలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.


కంచరపాలెంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


మాధవధారలో ఆటో యూనియన్ సభ్యులు ప్రతిష్ఠించిన విగ్రహం

పరిశీలక గృహాల తనిఖీ కమిటీ సభ్యునిగా నరవ ప్రకాశరావు



డాబాగార్డెన్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలల రక్షణకు సంబంధించిన జువెనల్ జస్టిస్ చట్టం ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన బాలల పరిశీలకగృహాల పనితీరుపై తనిఖీ కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మూడేళ్ల కాల పరిమితిగల కమిటీ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ బాలల గృహాలు చట్ట నిబంధనలు పాటిస్తున్నాయా? లేదా? తనిఖీ చేసి నివేదికలు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందజేస్తాయి. ఈ కమిటీలో సభ్యునిగా నరవ ప్రకాశరావును నియమించడంపై వైజాగ్ ఎన్జీఓ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, జి.వి.రత్నం హర్షం వ్యక్తం చేశారు. తనకు అవకాశం కల్పించిన కలెక్టర్‌కు ప్రకాశరావు కృతజ్ఞతలు తెలిపారు.

బాక్సింగ్ త్రీ స్టార్ రిఫరీ పరీక్షలో కిరణ్‌సాగర్, మురళీకృష్ణ ఎంపిక


కిరణ్‌సాగర్


మురళీకృష్ణ

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాక్సింగ్ రిఫరీ అప్ గ్రేడింగ్ పరీక్షలలో నగరానికి చెందిన వాల్తేరు రైల్వే బాక్సింగ్ క్రీడాకారులు కిరణసాగర్, మురళీకృష్ణ ఉత్తీర్ణులయ్యారు. నొయిడాలో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రిఫరీ/జడ్జి అప్ గ్రేడేషన్ సెమినార్ కమ్ పరీక్షలలో కిరణ్‌సాగర్, మురళీకృష్ణ ప్రతిభ కనబరిచి త్రీ స్టార్ రిఫరీ హోదా పొందారు. ఆంధ్రప్రదేశ్ నుంచి త్రీ స్టార్ రిఫరీ అర్హత సాధించిన తొలి బాక్సర్లుగా కిరణ్‌సాగర్, మురళీకృష్ణ ఘనత సాధించారు. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే బాక్సింగ్ క్రీడాకారులు, బాక్సింగ్ క్రీడా సంఘం ప్రతినిధులు వారికి అభినందనలు తెలిపారు.

ఎర్నిమాంబకు రూ.24 లక్షల ఆదాయం

జ్ఞానాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధి గాంచిన జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయంలో సోమవారం దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం, ఆలయ ధర్మకర్తలు, పోలీసుల సమక్షంలో హుండీ కానుకలు లెక్కించారు. జులై 14 నుంచి సెప్టెంబరు 22 వరకు హుండీల ద్వారా అమ్మవారికి రూ.24,06,615 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్ బాబా తెలియజేశారు.

జిల్లా వైద్యాధికారి తనిఖీ

అల్లిపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు సేవలందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. ఆయన సోమవారం 34వ వార్డులోని కొబ్బరితోట పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అక్కడ జరుగుతున్న అభ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి ఏఎన్ఎంల సేవలను సమీక్షించారు.

కిరండూల్ పాసింజర్‌కు అదనపు కోచ్

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగిస్తున్న 58501, 58502 నంబర్లు గల పాసింజర్ రైళ్లకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ క్లాసు కోచ్‌ను అదనంగా జత చేస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.

'చిరు వ్యాపారుల బడ్డీలు తొలగించడం తగదు'


కేజీహెచ్ వద్ద బైఠాయించిన ఆందోళనకారులు

మహారాణిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా చిరు వ్యాపారుల బడ్డీలు తొలగించటం అన్యాయం, దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. సోమవారం కేజీహెచ్ బయట ఉన్న బడ్డీలను జీవీఎంసీ అధికారులు తొలగించటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'ఆపరేషన్ స్తమక్' పేరుతో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల కడుపు కొడుతోందని ఆరోపించారు. తక్షణమే పేదల బడ్డీల తొలగింపు ఆపకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కొండా రాజీవ్ గాంధీ, సారిపల్లి అప్పలరాజు, కోరాడ సురేష్, పలువురు వార్డు నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకం


అక్కినేని నాగేశ్వరరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళా రంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ రంగానికి ఎనలేని సేవలందించిన పద్మవిభూషణ్, దాదాఫాల్కే అవార్డు గ్రహీత డా.అక్కినేని నాగేశ్వరరావు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని పలువురు కళారంగ ప్రముఖులు అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలోని స్వరమాధుర్యం, ఎంవీఆర్ సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అక్కినేని చిత్ర గీతాష్టమి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మనోపల్లా, బాచి, ఇమంది రమణ, భయ్యా శ్రీనివాస్, ఎంవీఆర్ నాగేశ్వరరావు, దెందేటి భూపతిరావు, సన్‌మూర్తి, ఫణిస్వామి, పట్నం వెంకటేష్, మంజు, రుద్రప్రసాద్, ఉషచీరాల, బాబ్జిపల్లా, వెంకట్ అక్కినేనిలు విచ్చేసి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సినీ రంగానికి అక్కినేని అందించిన సేవలు మరవలేనివన్నారు. జీవితాంతం నటిస్తూనే ఉన్నారన్నారు. ఆయన నటించిన భక్తి చిత్రాల ద్వారా ప్రజల్లో చెరగని ముద్రవేశారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన సేవలను గుర్తించి అందించిన అవార్డులు ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. తదుపరి గాయనీ గాయకులు రాజేంద్రప్రసాద్, సాత్విక, రామనరసింహం, రంజిత, రామ్‌ఉజాత, భాగ్యలక్ష్మి, ఎంవీఆర్, రఘురామ్, రవి, రామారావు, రాజీ అక్కినేని నటించిన మధురమైన గీతాలను ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, గాయనీగాయకులు పాల్గొన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖ

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఐటీ హబ్‌గా మారనుందని, ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయని రాష్ట్ర ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ వెల్లడించారు. విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో సోమవారం ప్రారంభమైన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో ఆయన 'ఐటీ హబ్‌గా విశాఖ' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పది శాతం వార్షిక వృద్ధి రేటుతో స్వర్ణాంధ్ర-2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మారేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. దూరదృష్టితో గ్రీన్ కారిడార్లు నిర్మిస్తోందని, భవిష్యత్తులో రాష్ట్రం ప్రధాన ఇంధన ఎగుమతిదారుగా మారుతుందన్నారు. వ్యాపారాన్ని మరింత సులభతరం చేయడానికి 21 రోజుల్లోనే చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 నానో, ఎంఎస్ఎంఈ పార్కులను ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో నిర్మిస్తోందని, వీటి ద్వారా రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఏపీ జనాభాలో 71 శాతం మంది కష్టపడి పనిచేసే వయస్సులో ఉన్నారని, ఇది చక్కటి అవకాశమన్నారు. 3.8 కోట్ల మందికి డిజిటల్ స్కిల్ కార్యక్రమం రూపొందించామని, ఆన్‌లైన్ ద్వారా నైపుణ్యం పేరుతో అప్‌స్కిల్లింగ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పరిశ్రమకు-ప్రతిభకు మధ్య అంతరం తగ్గిస్తున్నామన్నారు. ఒరాకిల్, ఇన్ఫోసిస్, సిస్కో, మైక్రోసాఫ్ట్ తదితరులతో వీటి కోసం పనిచేస్తున్నామన్నారు. ఈ సదస్సులో కాగ్నిజెంట్ ప్రతినిధి గౌవర్ హజ్రా, సిఫీ ఇనిఫినిటీ సీఈఓ శరద్ అగర్వాల్, సుందరి పాటిబండ్ల, వంశీకృష్ణ జడాల తదితరులు పాల్గొన్నారు.

'అంతిమ కోరిక' చిత్రానికి అవార్డులు


అవార్డు స్వీకరిస్తున్న జి.వి.త్రినాథ్, రాజీవ్

డాబాగార్డెన్స్ సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీలలో నగరానికి చెందిన రచయిత, నటుడు జి.వి.త్రినాథ్ రచన, దర్శకత్వంలో నిర్మితమైన 'అంతిమ కోరిక' లఘు చిత్రానికి ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు అవార్డులు లభించాయి. సోమవారం చుక్కపల్లి ఆడిటోరియంలో ఈ బహుమతి ప్రదానోత్సవంలో తెలుగు సినిమా డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్, మనసంతా నువ్వే దర్శకుడు ఆదిత్య, పురుషోత్తముడు దర్శకుడు వీరశంకర్ చేతులమీదుగా ఉత్తమ దర్శకుడిగా అవార్డును జి.వి.త్రినాథ్, ఉత్తమ నటుడు అవార్డును ఈ చిత్ర హీరో రాజీవ్ అందుకున్నారు. ఈ రెండు అవార్డులు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని త్రినాథ్ అన్నారు.



ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద కేక్ కట్ చేస్తున్న ఏఐఐఈఏ అధ్యక్షురాలు కామేశ్వరి తదితరులు

'జీఎస్టీ ఉపసంహరణ నిర్ణయం హర్షణీయం'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయ సేకరణ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియాలపై 18 శాతం జీఎస్టీని ఉపసంహరించుకుందని ఏఐఐఈఏ విశాఖ అధ్యక్షురాలు ఎ.కామేశ్వరి సంతోషం వ్యక్తంచేశారు. సోమవారం ఎల్ఐసీ బిల్డింగ్ కార్యాలయ ఆవరణలో హర్షం వ్యక్తం చేస్తూ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విజయాన్ని సాధించడానికి ఏఐఐఈఏ నిరంతర పోరాటం చేస్తూ వచ్చిందన్నారు. 2017లో దేశ వ్యాప్తంగా 45.23 లక్షల సంతకాలు సేకరించి కేంద్రానికి సమర్పించిందన్నారు. సుమారు 400 మంది ఎంపీలను ప్రత్యక్షంగా కలిసి జీఎస్టీ వసూలు అన్యాయంపై వివరించామన్నారు. ఇది ప్రజలకు కొంత ఉపశమనం కలిగించినా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ప్రకటించారు. బీమా రంగంలో ఎఫ్‌డీఐ 100 శాతం పెంపునకు ఎల్ఐసీ షేర్లు అమ్మకానికి వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, మీడియా ఇన్‌చార్జ్ ఎ.రామకృష్ణ, ఐసీఈయూ, బీఎస్ఈ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే జీఎం విస్తృత తనిఖీలు


సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం పరమేశ్వర పంక్వాల్, చిత్రంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లో పారిశుధ్యం, ప్రయాణికుల సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా రిజర్వేషన్, జనరల్ బుకింగ్ కార్యాలయాలు, క్యాప్సూల్ హోటల్, క్యాటరింగ్ స్టాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, విచారణ కేంద్రంలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఆ సమయంలో ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చిన బెంగళూరు-హతియా ఎక్స్‌ప్రెస్‌లో (12835) ఆకస్మికంగా ప్రవేశించి మరుగుదొడ్లు, పారిశుద్య నిర్వహణ, నీటి సరఫరా తీరును తనిఖీ చేశారు. అనంతరం ఆశీర్వాద్ కల్యాణ మండపంలో జరిగిన తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ కాంగ్రెస్ వార్షిక సాధారణ సమావేశానికి హాజరయ్యారు. అక్కడ నుంచి మర్రిపాలెంలోని శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న తరగతులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సెమినార్‌లో పాల్గొని డీజిల్ లోకోషెడ్ మెకానికల్ వింగ్ చేపడుతున్న వినూత్న మార్పులను అభినందించారు. కోచింగ్ కాంప్లెక్సుకు చేరుకుని ఏపీ ఎక్స్‌ప్రెస్ వంటి కొన్ని ప్రధాన రైళ్లను తనిఖీ చేసి కోచ్‌ల నిర్వహణలో మెరుగైన పద్ధతులు పాటించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐటీ సేవలు మరింత విస్తృతం

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. మంచి పనులు చేసేటపుడు కొన్ని ఇబ్బందులు వస్తాయని, వాటిని అధిగమించాలని సీఎం సూచించారు. నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని, ఆక్రమణలు తొలగించిన స్థానంలో మళ్లీ వ్యాపారాలు చేయకుండా బాధ్యత తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో పనిచేసే టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఈ ఆక్రమణల పట్ల అప్రమత్తం చేయాలని చెప్పారు. వీటిని ఎవరు ప్రోత్సహించవద్దని, సిబ్బంది సహకరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు ఇలాంటి అంశాల జోలికి పోకుండా తాను సూచనలు చేస్తానని హామీ ఇచ్చారు.

రైళ్లు కిటకిట

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (22203)కు కొన్ని తేదీల్లో బెర్తులు/ఆర్ఏసీ అందుబాటులో ఉన్నాయి. విశాఖ మీదుగా నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703), కోణార్క్ (11020), ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వంటి దూరప్రాంత రైళ్లకు అక్టోబరు 10 వరకూ డిమాండ్ నెలకొంది.

చెన్నై, బెంగళూరు, హౌరా రైళ్లు రద్దీ

విశాఖ మీదుగా హౌరా, బెంగళూరు, చెన్నై వెళ్లే రైళ్లకు సోమవారం నుంచి మరింత రద్దీ పెరిగింది. చెన్నై, హౌరా మధ్య రాకపోకలు సాగించే కోరమండల్ (12842), మెయిల్ (12840), చెన్నై-సంత్రాగచ్చి (22808), చెన్నై-షాలిమార్ (22826) వంటి రైళ్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి హౌరా, చెన్నై చేరే రైళ్లు కిటకిటలాడాయి. అలాగే భువనేశ్వర్-బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-యశ్వంత్‌పూర్ (12863), భువనేశ్వర్-బెంగళూరు వంటి పలు రైళ్లు రద్దీగా నడిచాయి.

ఉక్కు సమస్యలపై కలెక్టర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

కేంద్రం ద్వారా వచ్చే జాబితా ప్రకారం దశల వారీగా వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మే నెలలో 200 మందికిపైగా నిర్వాసిత కాంట్రాక్టు వర్కర్లను తొలగించారని, తక్షణం వారిని తిరిగి తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా నిర్వాసిత కుటుంబాల కోసం ప్లాంటు యాజమాన్యం సహకారంతో నడుస్తున్న విశాఖ విమల విద్యాలయాన్ని కొనసాగించాలని అభ్యర్థించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొనసాగించలేని పక్షంలో అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఆ విద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే ఎయిడెడ్ సిబ్బంది ద్వారా దానిని నడిపిస్తామని, తద్వారా ఆ ప్రాంత పేద పిల్లలకు విద్య అందుతుందన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని సూచించారు. ఈ సమస్యల పట్ల స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే తగిన నిర్ణయాలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

24న విజయవాడకు డీఎస్సీ అభ్యర్థులు

... 5వ పేజీ తరువాయి

అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేస్తారు. విజయవాడలో నియామక పత్రాలు అందుకున్న తరువాత తిరిగి జిల్లాకు తీసుకువస్తారు. అలాగే దసరా సెలవులు ముగిసిన తరువాత అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు నూతన ఉపాధ్యాయులకు కేటగిరీల వారీగా శిక్షణ ఇస్తారు. ఇందుకు సబ్బవరం, రుషికొండ ఐటీ హిల్స్‌లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. శిక్షణ చివరిరోజు పదో తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అందుకు ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీల వివరాలను సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పాడేరు డివిజన్, అనకాపల్లి జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. వీటిని ఈ పర్యాయం భర్తీ చేస్తారు. ఈ ఏడాది జూన్‌లో చేపట్టిన కౌన్సెలింగ్‌లో మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీలో పనిచేస్తూ బదిలీ అయినవారు చాలామంది ఇప్పటివరకూ రిలీవ్ కాలేదు. ఆయా పోస్టుల్లోకి వెళ్లేందుకు టీచర్లు లేకపోవడమే అందుకు కారణం. డీఎస్సీలో ఎంపికైన టీచర్లను అక్కడకు పంపి, వారిని రిలీవ్ చేస్తామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

మసాజ్ సెంటర్‌లపై నిఘా

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపకపోతే సమస్య మరింత తీవ్రంగా మారి నగరంలో శాంతిభద్రతల సమస్యకు దారితీయడం ఖాయమని గుర్తించిన సీపీ శంఖబ్రతబాగ్చి హోటళ్లు/లాడ్జిలు, మసాజ్ సెంటర్లపై నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో మసాజ్ సెంటర్లు, హోటళ్లు/లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారిదేనని, ఏదైనా తేడా వస్తే అందుకు బాధ్యుడిని చేస్తానని సీపీ హెచ్చరించారు. అంతేగాకుండా ఒక స్టేషన్ పరిధిలోని హోటళ్లు/లాడ్జిలు, మసాజ్ సెంటర్లపై మరొక పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బందితో ఆకస్మిక దాడులు చేయిస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఇదే తరహాలో ఆకస్మిక సోదాలు జరుగుతుండడంతో వరుసగా చీకటి కార్యకలాపాలు బయటపడుతున్నాయి. కొద్దిరోజుల కిందట నగరంలోని ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో గల లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు బయటపడగా, మరో స్టేషన్ పరిధిలోని మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం గుట్టురట్టయింది. తాజాగా నగర శివారునున్న పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితోపాటు ఒక విటుడిని, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులు కొనసాగుతాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

ఫ్చ్...

... 5వ పేజీ తరువాయి

అమలుచేశారు. మిల్క్, చీజ్, నెయ్యిలపై తగ్గింపు ధరలు అందుబాటులోకి వచ్చాయి. పాలు (లీటరు)పై రూ.3 వరకు తగ్గగా, 500 గ్రాముల నెయ్యిని కంపెనీని బట్టి రూ.20 నుంచి రూ.40 వరకు తగ్గించారు. పన్నీర్ ధర కిలోకు రూ.20 నుంచి రూ.25 వరకు తగ్గింది. మిల్క్ షేక్‌లు, ప్లమ్ కేక్స్‌పై రెండు నుంచి ఐదు రూపాయల వరకు తగ్గింది. కాగా మరికొన్ని కంపెనీలు పాత ధరలకే విక్రయిస్తున్నాయి. 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో కార్లు, బైక్‌ల ధరలు దిగి వచ్చాయి. కంపెనీ ధరను బట్టి కనిష్ఠంగా రూ.ఆరు వేల నుంచి రూ.15 వేలు వరకు తగ్గింది. కార్ల ధరలు భారీగా తగ్గాయి. ఒక్కో కారుపై రూ.60 వేల నుంచి రూ.1.1 లక్షల వరకు తగ్గినట్టు షోరూమ్ యజమానులు చెబుతున్నారు.

హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు భారీగా రేట్లు తగ్గించాయి. ఇద్దరు పిల్లలున్న కుటుంబానికి (వయసును బట్టి) రూ.10 లక్షల పాలసీకి ఇప్పటివరకూ రూ.24 వేల నుంచి రూ.28 వేల వరకు వసూలు చేస్తుండగా, దీనిపై జీఎస్టీని పూర్తిగా మినహాయించడంతో రూ.19 వేల నుంచి రూ.20 వేల మధ్య అందుబాటులోకి వచ్చాయి. ఇక ఏసీ, డిష్ వాషర్, టీవీలు 28 శాతం నుంచి 18 శాతం శ్లాబుల్లోకి మార్చడంతో ధరలు తగ్గాయి. సామర్థ్యాన్ని బట్టి ఏసీపై రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు, డిష్ వాషర్‌పై రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, టీవీలపై రూ.4 వేల నుంచి రూ.పది వేలు తగ్గించి విక్రయిస్తున్నారు.

తగ్గని వస్తువులు ఇవే..

జీఎస్టీ శ్లాబులు మేరకు ధరలను తగ్గించి విక్రయించాలని కేంద్రం ఆదేశించినప్పటికీ అనేక మంది వ్యాపారులు పట్టించుకోలేదు. పౌడర్, షాంపూ, హెయిర్‌ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్, కేక్, బిస్కెట్స్, కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్, ఐస్‌క్రీమ్, మినరల్ వాటర్, మెడిసిన్స్ ధరలు తగ్గలేదు. వస్త్రాలు, ఫుట్‌వేర్, మందులకు పాత ధరలే వసూలు చేశారు. అయితే బిల్లులో తగ్గిన జీఎస్టీలను చూపిస్తూ డిస్కౌంట్ రేట్లను పెంచి వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా తాము ఇప్పటికే జీఎస్టీ చెల్లించి సరకులు కొనుగోలు చేశామని, వాటిని తగ్గించి విక్రయిస్తే నష్టపోతామని కొందరు వ్యాపారులు...వినియోగదారులతో వాదనకు దిగారు. ఆయా శ్లాబులకు అనుగుణంగా తగ్గిన ధరలతో కూడిన బోర్డులను ఏర్పాటుచేయాలని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్ ఇచ్చిన ఆదేశాలను ఎక్కడా అమలు చేయడం లేదు. కొద్దిచోట్ల మాత్రం 'తగ్గించిన జీఎస్టీ రేట్లు వర్తింపజేస్తున్నాము' అంటూ బోర్డులు పెట్టారు తప్ప ధరల వివరాలేవీ కనిపించలేదు.


పెందుర్తి అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధిలో స్వర్ణ కవచధారణలో దుర్గాదేవి


శారదాపీఠంలో బాలత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన రాజశ్యామల అమ్మవారు


బాలదుర్గాదేవి అవతారంలో యారాడ సాగరిగిరి కనకదుర్గమ్మ


నాయుడుతోట కృష్ణానగర్ దుర్గామల్లీశ్వర ఆలయంలో బాలత్రిపురసుందరిగా దుర్గాదేవి


71వ వార్డు పరిధిలోని శ్రీ దుర్గమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

దుర్గాదేవి నమోస్తుతే..

వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు
» అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు

పెందుర్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం పలు ప్రాంతాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఇక్కడి ఉత్తరాంధ్ర శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో గల దుర్గమ్మను స్వర్ణ కవచంతో అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు భవానీ మాల ధారణను స్వీకరించారు. పెందుర్తి, ప్రశాంతినగర్ ఆలయాల్లోని దుర్గమ్మలను, చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీదేవిని రజిత రూపిణిగా అలంకరించారు. చినముషిడివాడ సప్తగిరినగర్‌లో గల అలివేలు మంగాదేవి ఆలయంలోని అమ్మవారిని ఆదిలక్ష్మిగా, వెంకటాద్రి శిఖరం దిగువన గల మహాకామేశ్వరీ ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలోని మహాకామేశ్వరి మాతను రజిత రూపిణిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో 150 మంది మహిళలు కుంకుమపూజలు చేశారు. ఎస్‌ఆర్‌పురంలో గల కనకదుర్గను ఆలయ ధర్మకర్త ఎర్రిబాబు ఆధ్వర్యంలో ఊరేగించాక స్వర్ణకవచంతో అలంకరించి పూజలు జరిపారు. సరిపల్లిలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. స్థానిక కళాశాల వద్ద ఫ్రైండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి ప్రతిమను ప్రతిష్ఠించారుట. అదేవిధంగా చినముషిడివాడ శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర ఆధ్వర్యంలో శారదామాతకు నవరాత్రి కలశ స్థాపన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. శారదా రాజశ్యామల అమ్మవారికి పీఠాధిపతి పంచామృతాభిషేకాలు చేసి ఏకాదశ హారతులిచ్చారు. శ్రీరాజశ్యామల సహిత చండీ యాగాలకు అంకురార్పణ చేశారు. తొలిరోజు శారదా రాజశ్యామల మాతను బాలాత్రిపురసుందరి దేవిగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించు కున్నారు. ఇక్కడి సాధూ మఠం సమీపంలో దివంగత పీఠాధిపతి యద్దనపూడి అయ్యన్న పంతులు స్థాపించిన మహాకామేశ్వరీ పీఠంలో బ్రహ్మ కలశ స్థాపన, గోపూజ, అఖండ దీపారాధనలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మాహాకామేశ్వరీమాతను శైలపుత్రిగా అలం కరించి క్షీరాభిషేకం జరిపారు. కనకభార్గవి మహా యజ్ఞం, రుద్ర హోమం, వనదుర్గ హోమాలకు అంకురార్పణ చేశారు.

గాజువాక: గాజువాక పరిసర ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పలుచోట్ల ఉత్సవ నిర్వాహకులు పందిర్లు ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. గాజువాక పరిసరాల్లో సుమారు వందచోట్ల దుర్గమ్మ ప్రతిమలను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గాజువాక హైస్కూల్ వద్ద జరిగిన పూజల్లో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: ఉక్కు టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలో వేకువజామున మహా గణపతి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సహిత అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేశారు. మహాదుర్గ అమ్మవారిని శ్రీబాలత్రిపురసుందరి (ఆకుపచ్చ)గా, శ్రీమహాలక్ష్మీ అమ్మవారిని శ్రీఆదిలక్ష్మి (కాఫీ వర్ణం)గా, శ్రీమహాసరస్వతి అమ్మవారిని శ్రీభారతీదేవి (తెలుపు వర్ణం)గా అలంకరించి ప్రధాన అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు జరపగా, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


గోపాలపట్నం సమీప కొత్తపాలెంలో ప్రతిష్ఠించిన 25 అడుగుల దుర్గాదేవి విగ్రహం


తుంగ్లాంలో పసుపు, కుంకుమ ప్యాకెట్లతో దుర్గాదేవిని అలంకరించిన దృశ్యం


స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో పూజలందుకుంటున్న త్రిశక్తి అమ్మవార్లు శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహా సరస్వతి

ఆటోనగర్: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన నవదుర్గ అమ్మవారిని టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, నాయకులు వేగుంట శ్రీనివారావు, ఎం.వెంకట సుబ్బయ్య, ఎం.గణపతి, బి.జగదీష్, వెంకటేశ్, నాగార్జున, తదితరులు దర్శించుకున్నారు. 71, 72 వార్డుల పరిధిలోని శ్రీనగర్, సుందరయ్య కాలనీ, పాతకర్ణవానిపాలెంలోని శ్రీదుర్గాలమ్మ ఆలయంలో అమ్మవార్లకు పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. 70వ వార్డు ఎల్‌వీనగర్‌లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. డ్రైవర్సు కాలనీలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగనంపూడి: పాతఅగనంపూడి, గల్లవానిపాలెంలో భవానీ భక్తులు దుర్గాదేవి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భవానీ భక్తులంతా కలశ పూజలు చేశాక స్థానికంగా కనకదుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక కూడలిలో శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీ, పరిసర ప్రాంతాల్లో దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. పెదమడక కొండపై గల శ్రీమాతా దుర్గాభవానీ ఆలయంలో కుంకుమ పూజలు జరిపారు. ఆలయంలో ఉత్సవాలు ముగిసేంత వరకు భవానీ భక్తులకు ఏర్పాటు చేసిన అన్న సమారాధనను జనసేన నాయకుడు విందుల వెంకటరమణ ప్రారంభించారు.

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, నాగేంద్రకాలనీ, పద్మనాభనగర్, వెంకటాపురం, తదితర ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు. అమ్మవారి ఆలయాలతో పాటు పలుచోట్ల ఉత్సవ మండపాలను ఏర్పాటు చేసి కనకదుర్గమ్మలను ప్రతిష్ఠించి పూజలు జరుపుతున్నారు. కొత్తపాలెంలో ప్రతిష్ఠించిన 25 అడుగుల దుర్గాదేవి విగ్రహం భక్తులను అమితంగా ఆకట్టుకుంటుంది. అమ్మవారిని బాలత్రిపురసుందరీదేవిగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడలోని ప్రియదర్శనీ కాలనీలో గల దుర్గాదేవి ఆలయంలో, సీతాగరం రామాలయం ఆవరణలో, ఎస్టీఆర్ సెంటర్‌లో, నెల్లిముక్కు ఆలయాల సముదాయాల వద్ద మండపాలను ఏర్పాటు చేసి దుర్గాదేవి అమ్మవార్లను ప్రతిష్ఠించి నిర్వాహకులు పూజలు జరిపారు. అలాగే హెచ్‌బీ కాలనీ, బర్మాకాలనీ, పెదగంట్యాడ దుర్గమాంబ ఆటో స్టాండ్, కొత్తదిబ్బపాలెం, అయ్యన్నపాలెం వికాస్‌నగర్, దయాళ్‌నగర్, తదితర ప్రాంతాల్లోనూ కనకదుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించారు.

అక్కిరెడ్డిపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తుంగ్లాం రామాలయం వద్ద దుర్గాదేవి అమ్మవారిని పసుపు, కుంకుమ ప్యాకెట్లతో అలంకరించి పూజలు చేయగా, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అక్కిరెడ్డిపాలెంలో నవ్యాంధ్ర మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవాల్లో భాగంగా భవానీ మాలధారణ చేసిన భక్తులు అమ్మవారికి పూజలు జరిపారు. నాతయ్యపాలెం బంగారమ్మ ఆలయం వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

మల్కాపురం: యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మ ఆలయంలో వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు కనకదుర్గమ్మను బాల దుర్గాదేవిగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శిం చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు.

సింధియా: జీవీఎంసీ 40, 62, 63 వార్డుల్లోని పలుచోట్ల దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. పలువురు భక్తులు భవానీ మాలధారణ చేసి అమ్మవార్లకు పూజలు చేశారు. పలు మండపాల వద్ద సాయంత్రం భజనలు చేశారు.

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్ దుర్గామల్లేశ్వరాలయంలోని దుర్గాదేవిని బాలత్రిపురసుందరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలో దుర్గాదేవి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు జరిపారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్న సమారాధన చేపట్టారు. అప్పన్నపాలెం శ్రీభూలోకమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.


పెదగంట్యాడలోని సీతానగరంలో దుర్గమ్మకు పూజలు

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

దేవాడ రైతుల సమస్యలు పరిష్కరించండి

» టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి : ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు


మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌కి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యేలు పంచకర్ల, బండారు

పెందుర్తి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెదగంట్యాడ మండలంలోని దేవాడ రైతుల సమస్యలు మైనార్టీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్ దృష్టికి పెందుర్తి, మాడుగుల ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్‌ను ఆయన చాంబర్‌లో సోమవారం కలిసి దేవాడ పరిధి 18 గ్రామాల్లో హిందు, ముస్లిం ప్రజలు 3 వేల ఎకరాల భూముల్లో నివసిస్తు, సాగు చేస్తున్నారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు నివాసిత హక్కులు కల్పించలేదన్నారు. ఎన్టీపీసీ, హిందుజ ప్రాజెక్టులను దేవాడ రైతులు రెండు వేల ఎకరాలు భూములిచ్చినా న్యాయం జరగలేదన్నారు. 2008లో అప్పటి ప్రభుత్వ జీవో నంబరు 10 తీసుకు వచ్చి దేవాడ రెవెన్యూ పరిధిలో ఉన్న భూములపై పూర్తి హక్కులు వక్ఫ్ బోర్డుకు కల్పించడంతో రైతులు పూర్తిగా జీవనోపాధి కోల్పోయారన్నారు. ఈ భూములకు హుదూద్ తుఫాను సమయంలో నష్టపరిహారం అందలేదని, గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మాణం జరగలేదన్నారు. హిందుజా ప్రాజెక్ట్ రైల్వేలైన్ నిర్మాణానికి రైతుల దగ్గర నుంచి సాగులో ఉన్న భూములను తీసుకుని నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. అలాగే వక్ఫ్ భూములపై పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఏపీలో కూడా అమలు చేసి దేవాడ రైతులకు న్యాయం చేయాలని కోరారు.



టిడ్కో ఇళ్లు త్వరగా అందించాలి

నియోజకవర్గంలోని టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 4368 టిడ్కో ఇళ్లు మంజూరు అవ్వగా, అందులో లబ్ధిదారులకు 1056 ఇళ్లు మాత్రమే అందాయని అన్నారు. ఈ క్రమంలో టిడ్కో గృహాల్లో 2212 నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని, మరో 1200 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. టిడ్కో ఇళ్ల కోసం తీసుకున్న లోను తీర్చాలని లబ్ధిదారులను బ్యాంకులు ఇబ్బందులు పెడుతున్నాయని తెలపారు. 60 ఏళ్లు నిండిన టిడ్కో లబ్ధిదారుడికి లోను ఇవ్వమని బ్యాంకులు చెబుతున్నాయని అన్నారు. పది సంవత్సరాల క్రితం ఎంపికైన టిడ్కో లబ్ధిదారుడికి 50 ఏళ్లు ఉంటాయని, వైసీపీ హయంలో టిడ్కో గృహాలను పూర్తి చేయలేదని, ఇప్పుడు ఆ లబ్ధిదారుడికి 60 ఏళ్లు ఉంటాయని అందుకే బ్యాంకులు లోన్లు ఇవ్వడం లేదని వివరించారు. నియోజకవర్గంలో లబ్ధిదారులు తన వద్ద పలు మార్లు టిడ్కో ఇళ్ల గురించి ప్రస్తావించారని, దీనికి తన వద్ద సమాధం లేదని పంచకర్ల ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే పంచకర్ల సభాధిపతిని కోరారు.

ఆధునిక గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి

» శాసనసభలో ఎమ్మెల్యే పి.గణబాబు



గోపాలపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నేటి యువతకు అనుగుణంగా సాంకేతికతను జోడించి ఆధునిక గ్రంథాలయాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సోమవారం జరిగిన శాసనసభలో కోరారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ చేపడుతున్న ప్రణాళిక అభినందనీయమన్నారు. పాఠశాలలకు రేటింగ్ ఇస్తూ అభివృద్ధిలో పోటీ పడుతున్నారని అన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆధునిక వసతులతో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. గణబాబు సూచనపై మంత్రి నారా లోకేశ్ స్పందించి గ్రంథాలయాలకు కూడా స్టార్ రేటింగ్ ఇచ్చే విధంగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. విశాఖ నగరంలో రూ.20 కోట్లతో ఆధునిక వసతులతో గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు మంత్రి లోకేశ్ తెలిపారు.

30 పడకల ఆస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్త్

గోపాలపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, డెర్మటాలజీ, పిడియాట్రిక్ వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుజాత, వైద్య బృందం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ.రత్నం

మల్కాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ రక్షణలో భాగంగానే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నారని, పర్యావరణ రక్షణ అందరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ ఎన్ జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ.రత్నం అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వాడవద్దని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ నార సంచులను, వస్త్రాలతో చేసిన సంచులను వినియోగించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి, జీవీఎంసీ, కోరమాండల్ ఫెర్టిలేజర్స్, గ్రీన్ క్లైమేట్ బృందం ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అనంతరం కోరమాండల్ ఎరువుల కర్మాగారం సీఎస్‌ఆర్ ప్రతినిధి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక వస్త్ర సంచులను ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కోరమాండల్ ఆధ్వర్యంలో ప్రజలకు నిరంతరం ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు తగు చర్యలు తీసు కోనున్నామని తెలిపారు. అనంతరం 300 మంది విద్యార్థులకు వస్త్ర సంచులను పింపిణీ చేశారు.


ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

నిరంతరం వైద్య సేవలందించాలని ధర్నా

పెదగంట్యాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలోని స్టీల్ ప్లాంట్ హెల్త్ సెంటర్‌లో 24 గంటలూ వైద్య సేవలందిచాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. నిరంతరం వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచాలంటూ సోమవారం హెల్త్ సెంటర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదగంట్యాడ, గంగవరం, గాజువాక ప్రాంతాల్లో సుమారు 3 వేల మందికి పైగా ఉక్కు కార్మికులు ఉంటున్నారని, అందువల్ల నిరంతరం వైద్య సేవలందించాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటలవరకు మాత్రమే వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.రామారావు, వెంకటరావు, అప్పలరెడ్డి, దీనబంధు, అప్పలరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు బోనస్ ఇవ్వాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు బోనస్ ఇవ్వాలని కోరుతూ గుర్తింపు యూనియన్ నాయకులు సోమవారం ఉక్కు యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా బోనస్ ఇవ్వలేదని, ఉద్యోగుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు యాజమాన్యం ముందుకు రావాలని కోరారు. దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు బోనస్ ఇస్తున్నందున ఉక్కు ఉద్యోగులకు కూడా ఇవ్వాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

విజ్ఞాన్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

అనంపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక సందర్శనలో భాగంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఎం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం నగరంలోని ఎంఎస్ఎస్ఆర్, డీవీవోఆర్ యూనిట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విభాగాల్లోని ఇంజనీర్లు విద్యార్థులకు సాంకేతిక అంశాల గురించి వివరించారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.పురుషోత్తం, ఏజీఎం పీవీవీ దుర్గారావులు విద్యార్థులకు వివవైన సమాచారాన్ని, తమ అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు మాధవరావు, శివయ్య, కళాశాల ప్రొఫెసర్లు కల్పన, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ హెల్త్ కేర్ యూనిట్ ప్రారంభం

గాజువాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సంరక్షణకు గాను రెండో మొబైల్ హెల్త్ కేర్ యూనిట్‌ను సోమవారం ఎంపీ ఎం.శ్రీభరత్ నగరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు సమీప ప్రాంతాల ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఇటువంటి యూనిట్లను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గంగవరం పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడికి సత్కారం

అగనంపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజవర్గ టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన మేడిశెట్టి ఉమామహేశ్వరరావును టీడీపీ 85 వార్డు నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర మాట్లాడుతూ కార్మిక సమస్యలపై పోరాటం చేస్తున్న ఉమామహేశ్వరరావుకు నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు డొక్కా రమేశ్, విందుల రాజు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రద్దుపై బీమా ఉద్యోగుల హర్షాతిరేకం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయడంలో బీమా ఉద్యోగులు, ఏజెంట్లతో పాటు ప్రజలందరూ ఐక్యంగా చేపట్టిన పోరాటాల ఫలితమేనని ఎల్ఐసీ గాజువాక (షిప్‌యార్డు బ్రాంచి) యూనియన్ నాయకులు ఇ.శ్రీనివాస్, సీహెచ్ నాగరాజు అన్నారు. జీఎస్టీ సంస్కరణలను సోమవారం నుంచి కేంద్రం అమలు చేస్తున్న నేపథ్యంలో షిప్‌యార్డు బ్రాంచిలో అధికారులు, ఉద్యోగులు, ఏజెంట్లు కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. బ్రాంచి మేనేజర్ సీహెచ్ఎస్ శ్రీనివాసరావు, సీహెచ్‌వీవీఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్ పార్కుల్లో శ్రమదానం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం మనందరి బాధ్యత అని తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి. విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం అన్నారు. 87వ వార్డు పరిధి తిరుమలనగర్ కాలనీలోని పలు పార్కుల్లో సోమవారం శ్రమదానం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ తమ పరిసరాల్లో చెత్తా చెదారాలు లేకుండా చర్యలు చేపట్టాలని, కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'ఆపరేషన్ లంగ్స్'

» పరిశుభ్ర, ఆరోగ్యకర, సుందర నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం
» వీధి వ్యాపారులకు ప్రత్యేక విక్రయ జోన్లు
» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్


కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని తద్వారా పరిశుభ్ర, ఆరోగ్యకరమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలో పార్కులు, ప్రధాన రహదారులు, జంక్షన్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, ప్రజలు, వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్ సౌలభ్యానికి అవకాశం కల్పించేందుకుగా 'ఆపరేషన్ లంగ్స్' చేపట్టామన్నారు. ఇప్పటివరకు 2,470పైగా ఆక్రమణలు తొలగించామన్నారు. దీంతో విశాలమైన రోడ్లు, అభివృద్ధి చేసిన ఫుత్‌పాత్‌లు, ప్రజలకు అం దుబాటులోకి వచ్చాయన్నారు. నగర వాసుల సౌకర్యార్థం జీవీఎంసీ ఈ చర్యలు చేపట్టిందని వివరించారు. వీధి వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు వీలుగా వారిని క్రమపద్ధతిలో గుర్తించి, విక్రయ జోన్లలో దుకాణాలు కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. నగరంలో గతంలో నియంత్రణ లేకుండా ఆక్రమణలతో అనధికారికంగా ఏర్పాటుచేసిన ఫుడ్‌స్టాళ్లు, చిల్లర వ్యాపారాలుతో తరచూ ట్రాఫిక్ అంతరాయాలు ఎదురవుతుండేవన్నారు. ఫుట్ పాత్‌లను, రోడ్లను, జంక్షన్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అనధికార ఫుడ్ స్టాళ్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రజల ఆరో గ్యానికి ముప్పు ఏర్పడుతోందని వైద్య నిపుణులు హెచ్చరించారన్నారు. ఇలా ం టి అనారోగ్యకరమైన, హానికరమైన ఆహార స్టాళ్లను కట్టడి చేసి, ఆహార భద్రతను నిర్ధారించడం, సురక్షితమైన ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడమే జీవీఎంసీ ఉద్దేశమని కమిషనర్ స్పష్టం చేశారు. 'ఆపరేషన్ లంగ్స్' ఎవరికీ వ్యతిరేకం కాదని, అపోహలు, అసత్య ప్రచారాలు నమ్మవద్దని, నగర ప్రజల ఆరోగ్యం, భద్రత, సౌకర్యం కోసం ప్రారంభించామన్నారు. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన విశాఖను అందుబాటులోకి తేవడమే జీవీఎంసీ లక్ష్యమన్నారు.

కార్మికుల పని గంటలను పెంచడం దారుణం

» కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్

మల్కాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచడం దారుణమని హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కార్మిక రంగం పూర్తిగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ 8 గంటలు ఉన్న పనిదినాన్ని 13 గంటలకు పెంచడం శ్రమ దోపిడి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పెట్టుబడుదారులకు అనుకూలమైన బిల్లు అని పేర్కొన్నారు. ఈ బిల్లును వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కె.పెంటారావు, వై.గంగాధర్, గంటా వాసు, ఏసుబాబు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ముఖ్యమంత్రి పర్యటన


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఎంపీలు సీఎం రమేశ్, శ్రీభరత్


అవార్డులు సాధించిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో కేంద్ర సహాయ మంత్రి జితేంద్రసింగ్, విశాఖ ఎంపీ శ్రీభరత్


ఈ గవర్నెన్స్ సదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం


కేంద్ర మంత్రి జితేంద్రసింగ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, బీజేపీ నాయకులు

గోపాలపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి (స్వతంత్ర) జితేంద్రసింగ్‌కు విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. సోమవారం మధ్యాహ్నం 1.50 గంటలకు భువనేశ్వర్ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు కలెక్టర్ డాక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అధికారులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి బయలుదేరి వెళ్లారు. సదస్సులో పాల్గొని తిరిగి సాయంత్రం 5.30 గంటలకు మంత్రి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంరం 5.50 గంటలకు ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

ముఖ్యమంత్రికి పట్టాభి కృతజ్ఞతలు


ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందిస్తున్న పట్టాభి

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం లోకల్ అడ్వైజరీ అధ్యక్షుడిగా నియమించినందుకు టీడీపీ నాయకుడు చోడే వెంకట పట్టాభి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నగరానికి వచ్చిన సీఎంను కోస్టల్ బ్యాటరీ వద్ద కలిసి వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు.

తర్లువాడ రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

» భీమిలి ఎమ్మెల్యే గంటాతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


సీఎం చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కు భూములిచ్చిన రైతులకు అన్ని విధాలా న్యా యం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. సోమవా రం నగరానికి వచ్చిన ఆయనకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే గంటా డేటా సెంటర్‌కు భూములిచ్చిన రైతులకు అదనపు నష్ట పరిహారంపై ముఖ్యమంత్రికి వివరించారు. తర్లువాడ పరిసర గ్రామాల్లో ధరను ప్రభుత్వం పెంచిందని, కానీ డేటా సెంటర్‌కు భూములిచ్చిన రైతులకు మార్కెట్ ధరలను వర్తింపజేయలేదన్నారు. ముఖ్యమంత్రి పరిశీలించి పరిహారం పెంపుపై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. నిర్వాసిత రైతు కుటుంబాలకు ఉద్యోగావకాశాలు, జీవనోపాధికి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సీఎం సుముఖత వ్యక్తం చేశారని గంటా తెలిపారు.

జిల్లా భూగర్భ జలశాఖ అధికారికి బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా భూగర్భజల శాఖ అధికారి ఎన్‌వీకే దుర్గాప్రసాద్‌కు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఆయనను శ్రీకాకుళం జిల్లా భూగర్భజల శాఖ అధికారిగా నియమించారు. అక్కడ పనిచేసే జి.శ్రీనివాసరావుకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి ఒంగోలు జిల్లాకు బదిలీ చేశారు. కాగా దుర్గాప్రసాద్ స్థానంలో ఎవరినీ నియమించలేదు.

సాంకేతికతలో ముందుండేలా కృషి చేస్తున్నాం

» జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో ఎంపీ శ్రీభరత్



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఎండాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతలో రాష్ట్రం ముందుండేలా కృషి జరుగుతోందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. కేంద్ర ఐటీ సమాచార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఈ- గవర్నెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పజా జీవితంలోకి వచ్చిన తర్వాత అనేక వినతులు వస్తున్నాయని వాటిని సత్వరం పరిష్కరించడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ప్రజల నుంచి మంచి ఆలోచనలు సలహాలు స్వీకరించడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. దేశంలో ఎక్కడైనా ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానం ఉంటే దానిని రాష్ట్రంలో అమలు చేయడానికి కృషి చేస్తానన్నారు. గ్రీవెన్స్ పరిష్కారం కోసం కొత్త ప్రణాళికలు రూపొందిచడంతో పాటు సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి నూతన ఆవిష్కరణలు తీసుకుని రావడం చాలా అవసరమన్నారు. ఈ దిశగా నిరంతరం కొత్త మార్గాలను అన్వేషిస్తామన్నారు. సాంకేతికతను ప్రజలకు చేరువ చేయడానికి ఏపీ ముందుంటుందని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ఈ-సేవ, మీ సేవల ద్వారా పౌరసేవలను అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు.

పోలీస్ కమిషనర్ పీజీఆర్ఎస్‌కు 80 ఫిర్యాదులు


బాధితులతో మాట్లాడుతున్న సీపీ

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కు 80 ఫిర్యాదులు అందాయి. కాన్ఫరెన్స్‌హాల్‌లో సీపీ శంఖబ్రత బాగ్చి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదేశించారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏయూ విద్యార్థులు


ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు


రోడ్డుపై నుంచి విద్యార్థులను తొలగిస్తున్న పోలీసులు

» సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

» బలవంతంగా తరలించేందుకు పోలీసుల యత్నం

» విద్యార్థులు ప్రతిఘటించడంతో ఉద్రిక్తత

మహారాణిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టర్ వచ్చే వరకు కదిలేది లేదని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి తరలించారు. విద్యార్థులు తీవ్రంగా ప్రతిఘటించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం ఉదయం విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి, పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనేకసార్లు వర్సిటీ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాలు ఇచ్చినా స్పందన కనిపించలేదన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలలో ఎవరో ఒకరు వచ్చి తమ సమస్యలు వినాలని, లేదంటే తమనే వారి వద్దకు పంపించాలని డి మాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై హామీ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ఈ క్రమంలో ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో కలెక్టరేట్ ఇన్‌చార్జి పరిపాలనాధికారి శ్యామ్ విద్యార్థుల వద్దకు వచ్చి, సమస్యలు వివరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినా వినిపించుకోలేదు. దీంతో తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. విద్యార్థులను బలవంతంగా తరలించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిఘటిస్తుండగానే పోలీసులు బలవంతంగా వారిని వ్యాన్‌లలోకి ఎక్కించి స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఏయూ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. పెరిగిన మెస్ బిల్లుల మేరకు స్కాలర్ షిప్ పెంచాలని, వర్సిటీలో ఖాళీ పోస్టులను భర్తీచేయాలని, మేనేజ్‌మెంట్ కోటాను రద్దు చేసి కన్వీనర్ కోటాలోనే భర్తీచేయాలని, నోడ్యూస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వ హించాలని డిమాండ్ చేశారు.

ఏటా 7 లక్షల మంది పేదలకు వరుణ్ గ్రూపు వైద్య సేవలు

» సంస్థ చైర్మన్ ప్రభు కిషోర్



మాట్లాడుతున్న వరుణ్‌గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్

విజయవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుణ్ గ్రూప్ వ్యాపార రంగంతో పాటు సామాజిక సేవలోనూ ముందుంటుందని, అందులో భాగంగా ఏటా 7 లక్షల మంది పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందని వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ అన్నారు. వరుణ్ గ్రూప్ 75వ వార్షికోత్సవం భారతీనగర్‌లోని నోవాటెల్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వర్ష పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వరుణ్‌గ్రూప్ 75 ఏళ్లుగా వైభవంగా కొనసాగుతుందన్నారు. 1950లో దివంగత కేశవరావు చౌదరి దీర్ఘదృష్టితో విజయవాడ పద్మజ కమర్షియల్ కార్పొరేషన్ (పీసీసీ)ను స్థాపించారన్నారు. అప్పట్లో జెటర్ ట్రాక్టర్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ వ్యాపారంతో చిన్నగా మొదలైన సంస్థ నేడు వరుణ్ గ్రూప్‌గా విస్తరించిందన్నారు. మూడో తరం వారసుడైన వరుణ్‌దేవ్ 2007లో మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి, సంస్థ పరిధిని విస్తరిస్తున్నారన్నారు. వరుణ్ గ్రూప్ నేడు, సుజుకి 4-వీలర్లు, 2-వీలర్లలో ప్రపంచంలోనే నంబర్‌వన్ డీలర్‌గా, బజాజ్ 2 వీలర్లు, 3 వీలర్లలోనూ ప్రపంచ నంబర్ వన్ డీలర్‌గా నిలిచిందన్నారు. ప్రస్తుతం 21,600 మందికి పైగా ఉద్యోగులు, 856 కస్టమర్ టచ్ పాయింట్స్ ద్వారా ఏటా 1.7 లక్షలకు పైగా వాహనాలను విక్రయిస్తూ, 20 లక్షలకు పైగా వాహనాల సర్వీసింగ్‌తో దేశంలోనే అతి పెద్ద ఆటోమొబైల్ గ్రూప్‌గా నిలిచిందన్నారు.

ఆటోమొబైల్ రంగం దాటి 2011లో నోవాటెల్ విశాఖపట్నం వరుణ్‌బీచ్, హోటల్ హాస్పిటాలిటీ రంగంలో అడుగుపెట్టిన వరుణ్ గ్రూప్, ఈ ప్రాజెక్ట్ తూర్పుతీరంలో లగ్జరీకి కొత్త నిర్వచనం తీసుకువచ్చిందని వివరించారు. నోవాటెల్ విజయవాడ వరుణ్ ప్రారంభించి అతిథ్య రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసిందని, కొత్త హాస్పిటాలిటీ ప్రాజెక్టులు అమరావతి, హైదరాబాద్‌లో రాబోతున్నాయన్నారు.

మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ మాట్లాడుతూ 1975లో ప్రభుకిషోర్ కుటుంబం వ్యాపారంలో చేరారని, 2025 నాటికి 50 ఏళ్ల నాయకత్వంతోపాటు సేవా ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారన్నారు. ఆయన నాయకత్వంలో వరుణ్ గ్రూపు క్రమశిక్షణ, నిబద్ధత, సమగ్ర దృష్టి, నిజాయితీ వంటి విలువలతో వివిధ రంగాల్లో విస్తరింపజేశారన్నారు. ఉద్యోగులు, కస్టమర్లు, ప్రిన్సిపల్స్, బ్యాంకర్లు, ప్రభుత్వం అనే ఐదు వేళ్ల సిద్ధాంతం పట్ల ఆయన నిబద్ధత గ్రూప్ నిరంతర విజయానికి మూలస్తంభమన్నారు. 2009లో తన తల్లిదండ్రులు నవరత్నం, కేశవరావు స్మారకార్థం ప్రభుకిషోర్ రాష్ట్రవ్యాప్తంగా హెల్త్‌సెంటర్లను స్థాపించారని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 9 హెల్త్ సెంటర్లు, ప్రతి ఏటా 7లక్షలకు పైగా పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నాయన్నారు. 2010లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏడు వరుణ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్‌ని ప్రారంభించగా, ఇప్పటివరకు 4వేల మందికి పైగా యువత శిక్షణ పొంది ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్‌గ్రూప్ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి



అలంకరణలో అమ్మవారు, కోటి కుంకుమార్చన చేస్తున్న మహిళా భక్తులు

మహారాణిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల ప్రారంభ సూచికగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కనకమహాలక్ష్మి ఆలయానికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఏకరూప వస్త్రధారణతో 102 మంది మహిళలు అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు, కుంకుమలు, పండ్లరసాలు తదితర 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. సాయంత్రం 200 మంది మహిళలు కోటి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా హోమం, కోలాటం నిర్వహించారు, ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా అమ్మవారు మంగళవారం లలితాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించాలి

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన


ఏఐటీయూసీ, సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఆపరేషన్ లంగ్స్ పేరుతో రోడ్ల పక్కన ఉన్న దుకాణాలు, బడ్డీలను తొలగించిన అధికారులు వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో చిరువ్యాపారులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. నగరంలో దుకాణాలు కోల్పోయిన వందలాది మంది చిరు వ్యాపారులు గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కార్యదర్శి పడాల రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ బడ్డీలు, దుకాణాలను యంత్రాలతో తొలగించడంతో వాటికి నష్టం వాటిల్లినందున వ్యాపారులకు జీవీఎంసీ నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసులు, సచివాలయం సిబ్బందిని వెంటపెట్టుకుని ఆకస్మికంగా దుకాణాలు తొలగించడం సరికాదన్నారు. దుకాణాలపైనే ఆధారపడి బతుకుతున్న సాధారణ, మధ్యతరగతి ప్రజలు ముద్ర రుణాలు తీసుకున్నారని, ఇప్పుడు వారంతా రుణాలను తీర్చడం ఎలా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆపరేషన్ లంగ్స్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారులకు తక్షణం నగరంలో హాకర్స్‌జోన్స్ ఏర్పాటుచేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమణమూర్తి, ఎస్ఎస్‌వర్మతోపాటు చీఫ్‌సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఆందోళన వద్దకు వెళ్లి వారి నుంచి వినతిపత్రం అందుకున్నారు. అనంతరం ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు నగరంలో ఉన్నందున కమిషనర్ కేతన్‌గార్గ్ అందుబాటులో లేరని, చిరువ్యాపారుల డిమాండ్లను తాము కమిషనర్ దృష్టికి తీసుకెళతామని వివరించారు. తక్షణం స్ట్రీట్ వెండింగ్ కమిటీలతో సమావేశం ఏర్పాటుచేసి సలహాలు, సూచనలు తీసుకుని వెండింగ్ జోన్స్ ద్వారా అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

క్రైం... crime news

పిడుగుపడి వ్యక్తి మృతి


సూర్యప్రకాశ్ మృతదేహం

కొమ్మాది/ఆరిలోవ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడుగు పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొమ్మాది శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం జరిగింది. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఆరిలోవ నెహ్రూ నగర్‌కు చెందిన దోహర్తి సూర్యప్రకాశ్ (38) కొమ్మాది శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా గ్రౌండ్ మెయింటినెన్స్ పనులు చేస్తుంటాడు. ప్రతిరోజూ ఇంటి నుంచి విధులకు వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటినుంచి బయలుదేరి గ్రౌండ్‌కు చేరుకున్నాడు. అక్కడ కటింగ్ మెషీన్‌తో గ్రౌండ్ నిర్వహణ పనులు చేస్తుండగా ఉదయం 11.30 గంటల సమయంలో పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్పోర్ట్సు కాంప్లెక్స్ అధికారులు 108కు కాల్‌చేశారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సూర్యప్రకాశ్‌ను పరిశీలించి మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి భార్యకు అధికారులు సమాచారం ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరిలోవలో విషాదం

స్టేడియంలో పిడుగు పడి సూర్య ప్రకాశ్ మృతి చెందడంతో అతడి భార్య భార్య ఆశ, కుమార్తెలు తేజశ్రీ, సోమేశ్వరి సంఘటన స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమను దిక్కులేని వారిని చేసి వెళ్లిపోయాడని బోరున విలపించారు. సూర్యప్రకాశ్ మృతితో ఆరిలోవ ప్రాంతం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

విమాన్‌నగర్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

» ఇద్దరికి తీవ్ర గాయాలు




ప్రమాదం జరిగిన భవనం, బాధితుడ్ని పరామర్శిస్తున్న మౌర్యసింహ

ఎన్ఏడీ జంక్షన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాషింగ్ మెషీన్‌కు షార్ట్ సర్క్యూట్ రేగిన మంటలు పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్‌కు వ్యాపించడంతో పెను ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్ మూడో ఫ్లోర్‌లో ఆర్మీ ఉద్యోగి పి.మురళీకృష్ణ కుటుంబం నివసిస్తోంది. ఆదివారం రాత్రి బాల్కనీలో ఉన్న వాషింగ్‌మిషన్‌ను ఆన్‌చేసి వదిలేసినట్టు సమాచారం. ఉదయం దానిలో దుస్తులు వేసేందుకు ప్రయత్నించగా మంటలు రేగాయి. ఆ పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్, కర్టెన్‌ను మంటలు అంటుకోవడంతో మురళి భార్య రాధ, కుమారుడు, కుమార్తె కిందింటివారికి చెప్పారు. వెంటనే అక్కడి చేరుకున్న నవీన్‌కుమార్, పాత్రుడు నీటితో మంటలు ఆపే ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ధాటికి గోడ పగలి ఇటుక ముక్కలు అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న వాచ్‌మన్ కాలికి తగిలాయి. తీవ్రంగా గాయపడిన వారిలో ఒకరిని కేజీహెచ్‌కు, మరొకరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితులను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహ పరామర్శించారు. మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ మాజీ సీఎండీకి నివాళి


బీఎన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ, ఉన్నతాధికారులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ మాజీ సీఎండీ బీఎన్.సింగ్‌కు స్టీల్‌ప్లాంట్ సీఎండీ, ఉన్నతాధికారులు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి బీఎన్.సింగ్ చేసిన కృషిని కొనియాడారు. ఉక్కు పరిశ్రమల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రధాన ఉత్పత్తిదారుగా మార్చడంలో ఆయన చేసిన సేవలు విశేషమన్నారు. 1997లో ప్లాంట్ నాలుగు వేల కోట్లతో తీవ్ర నష్టాలతో ఉన్న సమయంలో సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సవాళ్లను అధిగమించి 2002లో టర్న్ అరౌండ్ సాధించేలా మార్చారన్నారు. ఉక్కు రంగానికి ఎనలేని సేవలందించిన గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాంబాబు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే కార్యక్రమాలను పురస్కరించుకొని ది కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు, జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లోని పైడా డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ బ్యాంకులో పొదుపు ఖాతాలు, నిర్వహణ, విద్యా రుణాలపై అవగాహన కల్పించారు. కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకులో ఖాతాదారులకు అందజేస్తున్న వివిధ సేవలు, రుణ సదుపాయాలను వివరిస్తూ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించేందుకు ప్రత్యేక రుణ సదుపాయాన్ని తమ బ్యాంకు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పైడా విద్యాసంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, సహకారశాఖ జిల్లా అధికారిణి సత్యశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజిని, కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్యామ్‌కిశోర్, తదితరులు పాల్గొన్నారు.